మహబూబ్‌నగర్ జట్టు విజయం

- వనపర్తి జట్టుపై 47 పరుగుల తేడాతో గెలుపు
- సెంచరీ, 4 వికెట్లు తీసి సత్తా చాటిన డేవిడ్ క్రిపాల్
- సెంచరీతో రాణించిన ఏ. శ్రీకాంత్

7

ప్రజా సమస్యల పరిష్కారమే ఎజెండా

● బీసీ పొలిటికల్ జేఏసీ స్టేట్ చైర్మన్ రాచాల యుగంధర్‌గౌడ్


సభలో మాట్లాడుతున్న యుగంధర్‌గౌడ్

వనపర్తి టౌన్, మే 28 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారమే ఏజెండాగా బీసీ పొలిటికల్ జేఏసీ పనిచేస్తోందని బీసీ పొలిటికల్ జేఏసీ స్టేట్ చైర్మన్ రాచాల యుగంధర్‌గౌడ్ అన్నారు. బీసీ పొలిటికల్ జేఏసీ ఆధ్వర్యంలో బుధవారం వనపర్తి పట్టణంలోని పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో జనభేరి సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఉమ్మడి జిల్లాకు చెందిన వ్యక్తి రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి కావడాన్ని బీసీ పొలిటికల్ జేఏసీ స్వాగతించిందని అన్నారు. కానీ ప్రజా సమస్యలపై ఎక్కడా రాజీపడే ప్రసక్తే లేదన్నారు. రానున్న రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా పాదయాత్ర చేసి బీసీలను ఐక్యం చేస్తామని తెలిపారు.

'ఓట్లు మనవే..సీట్లు మనకే' అనేదే మన నినాదమని బీసీ మేధావుల ఫోరం అధ్యక్షుడు, రిటైర్డ్ ఐఏఎస్ చిరంజీవులు అన్నారు. రానున్న రోజుల్లో బీసీలు ఏకమై బీసీ నాయకులను గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మేక పోతుల నరేందర్, ప్రధాన కార్యదర్శి రామకోటి, బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు బీమన్న నాయుడు, యువజన సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాంమూర్తిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పాలమూరుకు సాంకేతిక.. సొబగులు


మాట్లాడుతున్న పాలమూరు ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, చిత్రంలో పేట ఎమ్మెల్యే పర్ణికారెడ్డి, పీసీసీ కార్యదర్శి వినోద్, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, గ్రంథాలయ చైర్మన్ నర్సింహారెడ్డి

- ట్రిపుల్ ఐటీ మంజూరు చేస్తూ జీవో విడుదల చేసిన ప్రభుత్వం
- ఈ అకాడమిక్ నుంచే ప్రారంభం
- దివిటిపల్లి-చిట్టబోయినపల్లిలలో 41.32 ఎకరాల స్థల సేకరణ..
- అప్పటివరకు తాత్కాలిక భవనంలో నిర్వహణ
- మూడు కోర్సులకు అనుమతులు..
- ప్రభుత్వ పాఠశాలలో మెరిట్ ప్రామాణికం
- ఫలించిన ఎమ్మెల్యే యెన్నం కృషి

సాంకేతిక సొబగులతో పాలమూరు మరో మైలురాయిని సొంతం చేసుకోనున్నది. పాలమూరు ట్రిపుల్ ఐటీ (రాజీవ్‌గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్) మంజూరు చేస్తూ రేవంత్ సర్కార్ బుధవారం జీవో నెంబర్ 24 జారీ చేయడంతో ఇక పాలమూరులో ప్రభుత్వ ఇంజనీరింగ్ విద్య వచ్చేసినట్లయింది. ఈ జీవోతో విద్యార్థులకు ఓ వరంలా మారింది. ఇందుకు ప్రజాప్రతినిధుల కృషి కూడా లేకపోలేదు.

మహబూబ్‌నగర్, మే 28 (ఆంధ్రజ్యోతి): విద్యారంగంలో పాలమూరు మరో అరుదైన ఘనత సాధించింది... సాంకేతిక సొబగులను సొంతం చేసుకోబోతున్నది.. ఇంజనీరింగ్ విద్య ఇక పాలమూరువైపు చూడబోతుంది.. ఇప్పటివరకు ట్రిపుల్ ఐటీ అంటే బాసర గుర్తుకు వచ్చేది.. ఇప్పుడు బాసర సరసన మనమహబూబ్‌నగర్ చేరబోతున్నది.. పాలమూరు ట్రిపుల్ ఐటీ (రాజీవ్‌గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్) మంజూరు చేస్తూ రేవంత్ సర్కార్ బుధవారం జీవో నెంబర్ 24 జారీ చేసింది. త్వరలోనే బడ్జెట్, మార్గదర్శ కాలకు సంబంధించిన మరో జీవో వెలువడనుంది. పూర్తిగా ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించే ఈ యూని వర్సిటీ కోసం ఇప్పటికే దివిటిపల్లి-చిట్ట బోయినపల్లి శివారు జాతీయ రహదారికి 44కు సమీపంలో స్థల పరిశీలన చేశారు. ప్రస్తుత అకాడమిక్ ఇయర్ 2025- 26లోనే అమలులోకి వస్తున్నట్లు జీవోలో వెల్లడించారు. అంటే ఈ సంవత్సరమే యూనివర్సిటీ ఏర్పాటు కానుంది. ఈ యూనివర్సిటీ కోసం దాదాపు 40-50 ఎకరాల స్థలం అవసర మవుతుంది.

మహబూబ్‌నగర్ - జడ్చర్ల నియోజకవర్గాల శివారు ప్రాంతమైన దివిటిపల్లి - చిట్టబోయినపల్లిలో 41.32 ఎక రాల స్థలాన్ని గుర్తించారు. దివిటిపల్లి

(మిగతా 6లో..)

సీఎం రేవంత్‌కు కృతజ్ఞతలు : ఎమ్మెల్యే యెన్నం

పాలమూరు జిల్లాకు ట్రిపుల్ ఐటీ మంజూరు చేసిన పాలమూ రు ముద్దుబిడ్డ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి జిల్లా ప్రజలు, ఎమ్మెల్యేల తరఫున కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని పాలమూరు ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బుధవారం పాలమూరు పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నారాయణపేట ఎమ్మెల్యే చిట్టెం పర్ణికా రెడ్డితో కలిసి మాట్లాడారు. ఏడాదిగా చేస్తున్న ప్రయత్నం ఫలిం చిందని, ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు ట్రిపుల్ ఐటీ వరం లాంటిదన్నారు. అత్యుత్తమ ప్రమాణాలతో విద్యార్థులకు ట్రిపుల్ ఐటీలో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. జిల్లా అభివృద్ధికోసం ఎమ్మెల్యేలమంతా సమష్టిగా ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి కూడా ప్రయత్నం చేశారని, స్థలం చిట్టబోయినపల్లిలో 20 ఎకరాలు చూశారని, అక్కడ ఉన్న విద్యా సంస్థను నవాబ్‌పేటకు షిఫ్ట్ చేసి ట్రిపుల్ ఐటీ జిల్లాకు వచ్చేందుకు సహకారం అందించారని చెప్పారు.

నారాయణపేట ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి మాట్లాడుతూ పాల మూరుకు ప్రతిష్ఠాత్మకమైన విద్యాసంస్థ రావడం జిల్లాకు గర్వకా రణమన్నారు. ఎమ్మెల్యేల అందరి తరఫున ముఖ్యమంత్రికి ధ న్యవాదాలు తెలిపారు. ఈ సమావేశంలో నాయకులు లక్ష్మణ్‌యా దవ్, మల్లు నర్సింహ్మారెడ్డి, వినోద్‌కుమార్, బెక్కరి అనిత, తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లా విద్యార్థులకు వరం

పాలమూరుకు ట్రిపుల్ ఐటీ రావడం ఉమ్మడి జిల్లా విద్యార్థులకు ఇంజనీరింగ్ విద్యకు ఎంతో ప్రయోజనం చేకూరనుంది. ఉమ్మడి పాలమూరుకు ఈ ప్రాంతం సెంటర్ పాయింట్ కానుంది. హైదరాబాద్‌కు దగ్గరగా ఉండటం, జాతీయ రహదారికి ఆనుకుని ఉండటంతో ఎంతో ప్రయోజకరంగా ఉండనుంది. ఉమ్మడి జిల్లా విద్యార్థులకు ఇక్కడ యూనివర్సిటీని చూస్తూ పెరగడం వల్ల అందులో చదవాలన్న ఆకాంక్ష తమ పిల్లలను అక్కడ చదివించాలన్న కోరిక తల్లిదండ్రులలోనూ కలగనుంది. జిల్లాలో యూనివర్సిటీ ఉండటం వల్ల ప్రభుత్వ పాఠశాలలో చదివే పిల్లలను అందులో సీటు తెచ్చుకుంటే భవిష్యత్తు బాగుంటుందన్న ఆలోచనను ప్రభుత్వం పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులకు అవగాహన కల్పిస్తూ ఆ దిశగా తమ బోధనను కూడా మెరుగుపరచాల్సిన అవసరం ఉంది.

ప్రజాస్వామ్య రక్షణ కోసం 'జై బాపు, జైభీమ్, జై సంవిధాన్'

- పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు


జై బాపు, జైభీమ్, జై సంవిధాన్ ర్యాలీలో మంత్రి జూపల్లి కృష్ణారావు

కొల్లాపూర్, మే 28 (ఆంధ్రజ్యోతి) : ప్రజాస్వామ్య రక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో 'జై బాపు, జైభీమ్, జై సంవిధాన్' ర్యాలీ నిర్వహిస్తున్నామని ఎక్సైజ్, సాంస్కృతికశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. బుధవారం నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలంలోని ఎల్లూరు గ్రామం నుంచి నార్లాపూర్ వరకు నిర్వహించిన ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. ముందుగా ఎల్లూరు గ్రామంలో గాంధీ, అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. అనం తరం ఎల్లూరు నుంచి నార్లాపూర్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం గ్రామస్థులను ఉద్దేశించి మంత్రి మాట్లాడారు. రాజ్యాంగ విలువలపై ప్రజల్లో అవగాహన పెంచడమే ఈ ర్యాలీ లక్ష్యమని, ప్రజాస్వామ్యాన్ని రక్షించుకోవడానికి రాహుల్ గాంధీ, 'జై బాపు, జైభీమ్, జై సంవిధాన్' నినాదానికి పిలుపునిచ్చారని అన్నారు. పార్లమెంట్ సాక్షిగా రాజ్యాంగాన్ని బీజేపీ అణగదొక్కాలని చూస్తోందన్నారు. అమిత్‌షా పార్లమెంట్ సాక్షిగా అంబేడ్కర్‌ను అవమానించారన్నారు. గ్రామ, మండల స్థాయిలో ఈ కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లాలని ఆయన కోరారు. మాజీ సీఎం కేసీఆర్ కుమార్తె ఎమ్మెల్సీ కవిత స్వయంగా కేసీఆర్ చుట్టు దెయ్యాలు ఉన్నాయని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కేసీఆర్ చుట్టూ ఉన్న దెయ్యాలు ఎవరో కవిత ప్రకటించాలని జూపల్లి డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ మాజీ సభ్యుడు హనుమంత్ నాయక్, మాజీ సర్పంచ్‌లు శేఖర్‌రెడ్డి, మేకల నాగరాజు, బచ్చలకూర బాలరాజు కాంగ్రెస్ పార్టీ మండల, గ్రామస్థాయి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రత్యేక తరగతులు ఎక్కడ?

- ఫెయిల్ అయిన 'పది' విద్యార్థులపై చిన్నచూపేల?
- పట్టించుకోని అధికారులు
- ఉమ్మడి జిల్లాలో 3095 మంది ఫెయిలైన విద్యార్థులు


మహబూబ్‌నగర్‌లోని ప్రభుత్వ షాబజార్ ఉన్నత పాఠశాల

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, మే 28 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షల్లో ఫెయిల్ అయిన విద్యార్థులకు ప్రభుత్వ పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు దృష్టి సారించి ఆయా సబ్జెక్టు ఉపాధ్యాయులచే ప్రత్యేక తరగతులు నిర్వహించాలని పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి ఆదేశించారు. కానీ పది విద్యార్థులకు ప్రత్యేక తరగతులు మాత్రం ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాల్లో ఎక్కడా జరుగుతున్నట్లు కనిపించడం లేదు. ఉపాధ్యాయులకు వరుసగా శిక్షణలు ఉండటంతో పది ఫెయిల్ అయిన విద్యార్థులను పట్టించుకున్న పాపాన పోలేదన్న విమర్శలు ఉన్నాయి. అయితే, గత పది పరీక్షల్లో ఏం తప్పు చేశాడో

(మిగతా 6లో..)

కొనసాగుతున్న వరద

- 'జూరాల'కు స్వల్పంగా పెరిగిన ఇన్‌ఫ్లో
- శ్రీశైలం ప్రాజెక్టుకు 7,065 క్యూసెక్కుల నీరు

6

'జూరాల' రోడ్డు అధ్వానం

- గుంతలమయమై రాకపోకలకు ఇక్కట్లు
- కృష్ణా పుష్కరాల సమయంలో నిధులు మంజూరు

7



కాల్వలకు మరమ్మతులేవి?

- ధ్వంసం అవుతున్న ఎంజీకేఎల్ఐ ప్రధాన కాలువ
- వచ్చే ఏడాదే మరమ్మతులు అంటున్న అధికారులు
- సాగునీరు ఎలా పారుతుందని రైతుల ఆగ్రహం

కోట్ల రూపాయలు ఖర్చు చేసి నిర్మించిన సాగునీటి కాలువలు ధ్వంసం అవుతున్నా అధికారులు, పాలకులు పట్టించుకోవడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. ఎక్కడైనా కాలువలు ధ్వంసమైతే వానాకాలానికి ముందు మరమ్మతులు చేయాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, దీంతో సాగునీరు ముందుకు పారేందుకు ఇబ్బందులు ఎదురవుతాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొల్లాపూర్ మండలంలోని ఎల్లూరు శివారులో రేగుమాన్ గడ్డ సమీపంలోని అంకిరావుపల్లి వద్ద ఎంజీకేఎల్ఐ ప్రధాన కాలువ పూర్తిగా ధ్వంసం అయ్యింది. ఈ కాలువలను పట్టించుకునే అధికారులు, ప్రజాప్రతినిధులు చూసీ చూడనట్లుగా వ్యవహరించడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. - కొల్లాపూర్, ఆంధ్రజ్యోతి


అంకిరావుపల్లి కాలువ దగ్గర ధ్వంసం అయిన ఎంజీకేఎల్ఐ ప్రధాన కాలువ

6

ప్రాణం తీసిన వివాహేతర సంబంధం

- భర్త, కుమార్తెను వదిలి మరో వ్యక్తితో వెళ్లిన వివాహిత
- తిరిగి వచ్చాక ఇరు కుటుంబాల మధ్య గొడవ
- ఆత్మహత్యాయత్నం చేసిన ప్రియుడు
- మనస్తాపంతో ఆమె బలవన్మరణం

7

ఆన్‌లైన్ ప్రక్రియను వేగవంతం చేయాలి

- కలెక్టర్ బీఎం సంతోష్


గుర్రంగడ్డ కొనుగోలు కేంద్రం వద్ద అధికారులతో మాట్లాడుతున్న గద్వాల కలెక్టర్ బీఎం సంతోష్

గద్వాల, మే 28 (ఆంధ్రజ్యోతి): రైతులు విక్రయించిన ధాన్యానికి వారి ఖాతాల్లో డబ్బు జమ అయ్యే విధంగా ఆన్‌లైన్ ప్రక్రియను వేగవంతం చేయాలని గద్వాల కలెక్టర్ బీఎం సంతోష్ అధికారులకు సూచించారు. బుధవారం గద్వాల మండలంలోని గుర్రంగడ్డ గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ధాన్యం 17 శాతం తేమ రాగానే కాంటా వేసి మిల్లులకు తరలించాలని నిర్వాహకులను ఆదేశించారు. జిల్లాలో ధాన్యం గతంతో పోల్చితే ఏడాది అధికంగా సేకరించామన్నారు. ఇప్పటి వరకు 90వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించి వంద కోట్ల రూపాయలను 10,500 మంది రైతుల ఖాతాలలో 48 గంటలలో జమ చేశామన్నారు. మిగతా పదిశాతం ధాన్యాన్ని మూడు రోజుల్లో తూకం వేసి మిల్లులకు తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల అధికారి స్వామికుమార్, పౌర సరఫరాల జిల్లా మేనేజర్ విమల, ఏపీడీ, అధికారులు, రైతులు ఉన్నారు.

నిబంధనల ప్రకారం ఇందిరమ్మ ఇళ్లు

- నాగర్‌కర్నూల్ కలెక్టర్ బదావత్ సంతోష్


ఇప్పలపల్లిలో ఇందిరమ్మ ఇంటిని పరిశీలిస్తున్న కలెక్టర్ సంతోష్

తిమ్మాజిపేట, మే 28 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ నిబంధనల ప్రకారం లబ్ధిదారులు ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకోవాలని నాగర్‌కర్నూల్ కలెక్టర్ బదావత్ సంతోష్ సూచించారు. బుధవారం నాగర్‌కర్నూల్ జిల్లా తిమ్మాజిపేట మండలంలోని ఇప్పలపల్లిలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇంటిని పరిశీలించారు. ఆ ఇంటి యాజమాని రేణుక, ఇంటిని నిర్మిస్తున్న మేస్త్రీతో మాట్లాడారు. ఇందిరమ్మ ఇంటి నిర్మాణాలకు ఇసుక ఉచితంగా అందిస్తున్నామన్నారు. ఇందిరమ్మ గృహ నిర్మాణాలు వేగంగా పూర్తి చేసి జూన్ 2నాటికి ఇంటిని ప్రారంభించుకునేలా చూడాలన్నారు. అదే గ్రామంలోని అంగన్‌వాడీ భవన నిర్మాణాన్ని పరిశీలించారు. అనంతరం మరికల్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఆయన వెంట హౌసింగ్ పీడీ సంగప్ప, తహసీల్దార్ రామకృష్ణయ్య, ఎంపీడీవో లక్ష్మీదేవమ్మ, వ్యవసాయ అధికారి కమల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ ధాన్యపు గింజను కొనుగోలు చేస్తాం

రైతులు ఆందోళన చెందొద్దు : కలెక్టర్ ఆదర్శ్ సురభి


కొనుగోలు చేసిన ధాన్యం వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్

శ్రీరంగాపూర్, మే 28 (ఆంధ్రజ్యోతి) : రైతులు పండించిన ప్రతీ ధాన్యపు గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, రైతులు ఆందోళన చెందవద్దని వనపర్తి కలెక్టర్ ఆదర్శ్ సురభి భరోసా ఇచ్చారు. బుధవారం ఉదయం వనపర్తి జిల్లా శ్రీరంగాపూర్ మండలంలోని శేరుపల్లిలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఇప్పటి వరకు ఇంకా వరి కోతలు ప్రారంభించని రైతులు వెంటనే కోతలు ప్రారంభించాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో అవసరమైన టార్పాలిన్‌లు అందుబాటులో ఉన్నాయని, వర్షానికి ధాన్యం తడిసిపోకుండా కప్పి ఉంచాలని సూచించారు. ఆయన వెంట అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

పోడు భూములపై హక్కులు కల్పించాలి

శ్రీశైలం-హైదరాబాద్ ప్రధాన రహదారిపై చెంచుల రాస్తారోకో


శ్రీశైలం- హైదరాబాద్ ప్రధాన రహదారిపై రాస్తారోకో చేస్తున్న సార్లపల్లి రైతులు

దోమలపెంట, మే 28 (ఆంధ్రజ్యోతి): పోడు భూములపై హక్కులు కల్పించాలని బుధవారం శ్రీశైలం - హైదరాబాద్ ప్రధాన రహదారిపై చెంచులు రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా చెంచు ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు చిగుర్ల మల్లికార్జున్ మాట్లాడుతూ చెంచు రైతులకు అటవీ హక్కుల చట్టం కింద నాగర్‌కర్నూల్ జిల్లా దోమలపెంట మండలం సార్లపల్లి పంచాయతీ పరిధిలోని రాసమొళ్ల బావి పెంటలో పోడు భూములకు 20 ఏళ్ల క్రితం ప్రభుత్వం పట్టాలు ఇచ్చిందని తెలిపారు. కానీ స్థానిక అటవీశాఖ అధికారులు ఆ భూములను సాగు చేయకుండా అడ్డుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్వయంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెంచులు సాగు చేసుకుంటున్న పోడు భూములకు పట్టాలు ఇచ్చి పండ్ల తోటల పెంపకానికి ప్రోత్సహించాలని చెబుతున్నా అటవీశాఖ అధికారులు మాత్రం అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని వాపోయారు. అచ్చంపేట నియోజకవర్గంలోని చెంచులు సాగు చేసుకుంటున్న పోడు భూములకు పట్టాలు ఇస్తూ, బ్యాంకు రుణాలు ఇచ్చే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. రాస్తారోకో చేయడంతో రహదారిపై భారీగా వాహనాలు నిలిచిపోవడంతో ఈగలపెంట ఎస్ఐ శ్రీనువాసులు అక్కడికి చేరుకుని చెంచులతో మాట్లాడి రాస్తారోకో విరమింపజేశారు. కార్యక్రమంలో తిరుపతయ్య, మానయ్య, వెంకటయ్య, తదితరులు పాల్గొన్నారు.

అడవిని నరికితే కఠిన చర్యలు..

రాసమొళ్లబావి పెంటలో 6 మంది గిరిజన రైతులకు 8 ఎకరాల పోడు పట్టా ఉన్నదని దోమలపెంట ఎఫ్ఆర్‌వో గురు ప్రసాద్ తెలిపారు. వారు అక్కడ వ్యవసాయం చేసుకునేందుకు ఎటువంటి అభ్యంతరం లేదని, వారికి ఉన్న భూమికన్నా ఎక్కువ భూమిని సాగు చేసేందుకు అడవిని నరికితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

డీఎస్ఆర్‌పై అనాసక్తి



హన్వాడ మండలం పెద్దదర్పల్లి గ్రామంలో చెత్త సేకరణలో కార్మికులు

- యాప్ డౌన్‌లోడ్‌కు కార్యదర్శుల విముఖత
- ఇప్పటికే పని భారం అయ్యిందని ఆవేదన
- బయోమెట్రిక్ విధానం వద్దని విజ్ఞప్తి
- సమస్య పరిష్కారానికి సబ్ కమిటీ
- హామీ ఇచ్చిన మంత్రి సీతక్క

మహబూబ్‌నగర్ న్యూటౌన్, మే 28 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో చెత్త సేకరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన డీఎస్ఆర్ (డైలీ శానిటేషన్ రిపోర్ట్) యాప్‌పై పంచాయతీ కార్యదర్శులు విముఖత వ్యక్తం చేస్తున్నారు. ఈ నెల 25వ తేదీ లోపు జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల కార్యదర్శులు ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని, చెత్తసేకరణ వివరాలను అప్‌లోడ్ చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. కానీ జిల్లాలో ఒక్క కార్యదర్శి కూడా యాప్‌ను డౌన్ లోడ్ చేసుకోలేదు. పంచాయతీ శాఖతో పాటు, గ్రామంలో అమలయ్యే అన్ని శాఖల పనులను తామే పర్యవేక్షిస్తాం కాబట్టి పనుల వివరాలను ఇచ్చిన సమయంలోనే యాప్‌లో అప్‌లోడ్ చేయడం సాధ్యం కాదని చెప్తున్నారు. పంచాయతీ కార్యదర్శుల సంఘం ఆధ్వర్యంలో వారు ఈ నెల 26న రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్కను కలిసి సమస్యలను వివరించారు. తమకు కాలపరిమితి విధిస్తే తాము ఉద్యోగాలు చేయలేమని విన్నవించారు. దీంతో పాటు తాము ఎదుర్కొంటున్న ఇతర సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. సబ్ కమిటీ వేసి సమస్యలు పరిష్కరిస్తామని మంత్రి సీతక్క వారికి హామీ ఇచ్చినట్లు సమాచారం.



పెద్దదర్పల్లిలో పారిశుధ్య పనుల్లో కార్మికులు(ఫైల్)

'బయోమెట్రిక్' సాధ్యం కాదు

ఇతర శాఖల మాదిరిగా పంచాయతీ శాఖలో ముఖ గుర్తింపు లేదా బయోమెట్రిక్ విధానం సాధ్యపడదని పంచాయతీ కార్యదర్శులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉదయం 9 గంటలకు క్షేత్ర స్థాయికి వెళ్లి ఫొటోలు తీసుకొని అప్‌లోడ్ చేసి, అటెండెన్స్ తీసుకొని, తిరిగి మండల కేంద్రంలో జరిగే సమావేశాలకు హాజరు కాలేమని చెప్తున్నారు. గ్రామంలో అనుకోని సంఘటనలు సంభవిస్తే కార్యదర్శి, పంచాయతీ సిబ్బంది మొత్తం అక్కడే రోజుల తరబడి ఉండి పని చేయాల్సి ఉంటుందని అంటున్నారు. అలా పని చేస్తున్న తమకు టైమ్ బాండ్, బయోమెట్రిక్ విధానం ఎలా సాధ్యమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లాం



డీఎస్ఆర్ యాప్ డౌన్‌లోడ్‌తో పాటు తాము ఎదుర్కొంటున్న సమస్యలను పంచాయతీ రాజ్ మంత్రి సీతక్క దృష్టికి తీసుకెళ్లాం. ముఖ గుర్తింపు, బయోమెట్రిక్ విధానం సాధ్యం కాదని వివరించాం. నిధులు విడుదల చేయాలని కోరాం. సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశాం. అందుకు మంత్రి సానుకూలంగా స్పందించారు. సబ్ కమిటీ వేసి సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

- శివ ప్రసాద్, పంచాయతీ కార్యదర్శుల సంఘం జిల్లా అధ్యక్షుడు

కార్యదర్శులు వ్యతిరేకిస్తున్నారు



చెత్త సేకరణకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన డీఎస్ఆర్ యాప్‌ను పంచాయతీ కార్యదర్శులు వ్యతిరేకిస్తున్నారు. రోజు వారీ చేసే పనిని ఇప్పటికే ఇతర యాప్‌లో నమోదు చేస్తున్నాం. ప్రతీ రోజు జిల్లా పంచాయతీ కార్యాలయంతో పాటు, కలెక్టర్‌కు సమర్పిస్తున్నాం. అదే పనిని వేరే విధానంలో ముఖ గుర్తింపు, బయోమెట్రిక్ విధానంలో అమలు చేయాలంటే సాధ్యం కాదని అంటున్నారు. ఇప్పటివరకు ఒక్క కార్యదర్శి కూడా యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోలేదు. ఈ సమస్య రాష్ట్ర వ్యాప్తంగా ఉంది.

- పార్థసారథి, డీపీవో

గ్రామ పంచాయతీ కార్యదర్శులే కీలకం

గ్రామంలో ఏ ప్రభుత్వ కార్యక్రమాలు జరిగినా పంచాయతీ కార్యదర్శి తప్పని సరిగా ఉండాల్సిందే. వారు పారిశుధ్య పనులను పర్యవేక్షిస్తూనే ఇతర శాఖల పనులను నిర్వహించాల్సి ఉంటుంది. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల గుర్తింపు మొదలుకొని, రేషన్ కార్డుల మంజూరు, రాజీవ్ యువ వికాసం లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ ఇలా అన్ని శాఖల పనులను వీరే నిర్వహించాల్సి ఉంటుంది. దీంతో పని భారం అధికం కావడం వల్ల చాలా మంది కార్యదర్శులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఇంత పని చేస్తున్న తమకు అధికారుల నుంచి మెమోలు, రాజకీయ నాయకుల నుంచి ఒత్తిడులు నిత్యకృత్యంగా మారాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో వారు డీఎస్ఆర్ యాప్‌ను ముక్తకంఠంతో వ్యతిరేకిస్తున్నారు.

18 నెలలుగా విడుదల కాని నిధులు

గ్రామ పంచాయతీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి 18 నెలలుగా నిధులు విడుదల కావడం లేదు. సర్పంచుల పదవీ కాలం ముగిసి 15 నెలలు గడిచింది. అప్పటి నుంచి పంచాయతీ కార్యదర్శులే ప్రత్యేక అధికారులుగా గ్రామాల్లో పాలనా వ్యవహారాలను కొనసాగిస్తున్నారు. ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కాకపోయినా, చెత్త సేకరించే ట్రాక్టర్‌కు ప్రతీ రోజు డీజిల్ పోయించాల్సిందే నని వారు చెప్తున్నారు. దాంతో పాటు గ్రామంలో పంపు సెట్ల మరమ్మతులు, చిన్నచిన్న పనులు తప్పని సరిగా చేపట్టాల్సి ఉంటుంది. కానీ డబ్బులు లేవని అంటే ప్రజల నుంచి ఒత్తిడి అధికం అవుతోంది. చేసేది ఏమి లేక కార్యదర్శులు అప్పులు తెచ్చి ఖర్చు చేయాల్సి వస్తోంది. ఇలా ఒక్కో కార్యదర్శి రూ. 2 లక్షల నుంచి రూ. 3 లక్షల వరకు అప్పులు చేసినట్లు సమాచారం.

కొనసాగుతున్న వరద

- 'జూరాల'కు స్వల్పంగా పెరిగిన ఇన్‌ఫ్లో
- శ్రీశైలం ప్రాజెక్టుకు 7,065 క్యూసెక్కుల నీరు



శ్రీశైలం జలాశయంలో నిల్వ ఉన్న నీరు

అమరచింత/ దోమలపెంట, మే 28(ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు వర ప్రదాయినిగా ఉన్న ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు బుధవారం ఎగువ నుంచి వరద ఉధృతి స్వల్పంగా పెరిగింది. ఎగువన మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల్లో కురుస్తున్న వర్షాలతో జలాశయానికి ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. మూడు రోజులుగా 2 వేల క్యూసెక్కులకు పైగా కొనసాగిన వరద, బుధవారం 3.629 క్యూసెక్కులకు పెరిగింది. ప్రాజెక్టు పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 9.657 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 6 టీఎంసీలకు చేరువలో ఉంది. ప్రాజెక్టు అధికారులు అప్రమత్తంగా ఉండి ఎప్పటికప్పుడు వరద ఉధృతిని అంచనా వేస్తున్నారు.

4.667 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి

కృష్ణానదికి ఎగువన కురుస్తున్న వర్షాలతో సుంకేసుల నుంచి 13.137 క్యూసెక్కుల నీరు శ్రీశైలం ప్రాజెక్టు వైపునకు వస్తుండగా, 7,065 క్యూసెక్కుల వరద జలాశయంలోకి చేరుతోంది. గడిచిన 24 గంటల వ్యవధిలో ఎడమ గట్టు జలవిద్యుత్ కేంద్రంలో 10,096 క్యూసెక్కుల నీటిని ఉపయోగించి 4.667 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి చేశారు. ఎంజీకేఎల్ఐ కాల్వ ద్వారా 1,360 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. దీంతో బుధవారం డ్యాంలో పూర్తి స్థాయి నీటి మట్టం 885 అడుగులకు గాను, 817.40 అడుగులకు చేరింది. పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 215.807 టీఎంసీలకు గాను, 39.9725 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు డ్యాం గేజింగ్ అధికారులు తెలిపారు. ప్రస్తుతం శ్రీశైలం జలాశయం నుంచి 11,582 క్యూసెక్కుల అవుట్‌ఫ్లో కొనసాగుతోందని చెప్పారు.

ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

- ఇమ్యూనైజేషన్ జిల్లా అధికారి డాక్టర్ పరిమళ



రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ పరిమళ

పాన్‌గల్, మే 28 (ఆంధ్రజ్యోతి) : ఆరోగ్యంపై ప్రతీ ఒక్కరు శ్రద్ధ వహించాలని ఇమ్యూనైజేషన్ జిల్లా అధికారి డాక్టర్ పరిమళ అన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా, పాన్‌గల్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రంలో బుధవారం నిర్వహించిన రెగ్యులర్ ఇమ్యూనైజేషన్ కార్యక్రమాన్ని జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ సాయినాథ్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాలిచ్చే తల్లులు మంచి పోషకాహారం తీసుకోవాలని సూచించారు. గర్భిణులు వైద్యుల సలహాలు, సూచనలను పాటించాలన్నారు. శిశువులకు సకాలంలో టీకాలు వేయించాలన్నారు. వైద్యులు ప్రజలకు అందుబాటులో ఉండాలని, విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం సబ్ సెంటర్‌లోని రికార్డులు, నివేదికలను పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా వ్యాక్సిన్ కోల్డ్ చెయిన్ మేనేజర్ పరశురాం, ఎన్సీడీ కోఆర్డినేటర్ చంద్రయ్య, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ రామయ్య, హెల్త్ అసిస్టెంట్లు నర్సమ్మ, నాగేశ్వరి, ఆశ కార్యకర్తలు అలివేలు, రేణుక, సరస్వతి పాల్గొన్నారు.

ప్రత్యేక తరగతులు ఎక్కడ?

(5వ పేజీ తరువాయి)



బోయపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల

గుర్తించి విద్యార్థులకు ఉత్తీర్ణత సాధించేలా అవగాహన కల్పించాల్సి ఉండగా, ఈ ఏడాది మాత్రం ఇప్పటి వరకు ఎలాంటి తరగతులు నిర్వహించలేదు. ఈ ఏడాది ప్రత్యేక తరగతులు ఉట్టి మాటలాగానే కనిపిస్తున్నాయి. వచ్చే నెల 3 నుంచి పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు ఉండగా ఇప్పటికీ ప్రత్యేక తరగతులు లేకపోవడంపై విద్యార్థులు, తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా విద్యార్థులకు తరగతులు నిర్వహించాలని కోరుతున్నారు. లేకుంటే విద్యార్థులకు కనీసం ఫోన్‌ఇన్ నిర్వహించాలని కోరుతున్నారు.

ఉమ్మడి జిల్లాలో 3095 విద్యార్థులు ఫెయిల్

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా వ్యాప్తంగా 3095 మంది విద్యార్థులు ఫెయిల్ అయ్యారు. మహబూబ్‌నగర్ జిల్లాలో పదో తరగతి పరీక్షలు 12,787 మంది రాశారు. అందులో 11,708 మంది ఉత్తీర్ణత సాధించగా, 1031 మంది ఫెయిల్ అయ్యారు. నాగర్‌కర్నూల్ జిల్లాలో 10,530 మంది విద్యార్థులు పరీక్ష రాయగా 10,196 మంది పాస్ అయ్యారు. 334 మంది ఫెయిల్ అయ్యారు. నారాయణపేట జిల్లాలో 7618 మంది విద్యార్థులు పరీక్ష రాయగా, 7151 మంది పాస్ అయ్యారు. 367 మంది ఫెయిల్ అయ్యారు. జోగుళాంబ గద్వాల జిల్లాలో 7569 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా 6944 మంది పాస్ కాగా 625 మంది ఫెయిల్ అయ్యారు. వనపర్తి జిల్లాలో 6842 మంది విద్యార్థులు పరీక్ష రాయగా 6104 మంది విద్యార్థులు పాస్ అయ్యారు, 738 మంది విద్యార్థులు ఫెయిల్ అయ్యారు.

ప్రత్యేక తరగతులు తప్పని సరిగా నిర్వహించాలి



పదో తరగతి పరీక్షలలో ఫెయిల్ అయిన విద్యార్థులకు ప్రభుత్వ పాఠశాలల్లో సబ్జెక్టుల వారిగా ప్రత్యేక తరగతులు నిర్వహించాలని గతంలోనే చూచించాం. ఎవరైనా నిర్వహించలేదని ఫిర్యాదులు వస్తే చర్యలు ఉంటాయి. వచ్చే నెల 3 నుంచి విద్యార్థులకు పది సప్లిమెంటరీ పరీక్షలు కొనసాగుతాయి. ఈ పరీక్షలలో విద్యార్థులు అందరు పాస్ అయ్యేవిధంగా ప్రధానోపాధ్యాయులు, సబ్జెక్టు ఉపాధ్యాయులు దృష్టి సారించారు.

- ప్రవీణ్‌కుమార్, జిల్లా విద్యాశాఖ అధికారి మహబూబ్‌నగర్



డెంపల్లిలో కూలిన కావలి అశోక్ ఇల్లు

వర్షానికి కూలిన మట్టి మిద్దెలు



చిన్నపొర్ల గ్రామంలో అమ్మది లలితమ్మ ఇల్లు

దామరగిద్ద/ ఊట్కూరు, మే 28 (ఆంధ్రజ్యోతి) : వారం రోజులుగా కురుస్తున్న వర్షానికి మట్టిమిద్దెలు కూలుతున్నాయి. నారాయణపేట జిల్లా, దామరగిద్ద మండల పరిధిలోని పిడెంపల్లి, ఊట్కూరు మండలంలోని చిన్నపొర్లలో రెండు మట్టి మిద్దెలు కూలిపోయాయి. పిడంపల్లికి చెందిన కావలి అశోకు చెందిన మిట్టిమిద్దె ఇంట్లో మంగళవారం రాత్రి ఓ గది కూలిపోయింది. ఆ సమయంలో కుటుంబ సభ్యులందరూ మరో గదిలో నిద్రిస్తుండటంతో ప్రమాదం తప్పింది. ప్రభుత్వం స్పందించి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని బాధితుడు కోరారు. అలాగే ఊట్కూర్ మండలంలోని చిన్నపొర్ల గ్రామంలో లలితమ్మకు చెందిన మట్టి ఇల్లు కూలిపోయింది. ఆ ఇంట్లో ఒంటరిగా నివసిస్తున్న లలితమ్మ ఆ సమయంలో మరో గదిలో పడుకొని ఉండటంతో ప్రాణాపాయం తప్పింది. కూలిన గదిలోని బియ్యం, పప్పు, ఇతర వంట సామగ్రి మట్టిలో కూరుకుపోయింది. విషయం తెలుసుకున్న గ్రామ పంచాయతీ కార్యదర్శి గౌతమ్‌గౌడ్ కూలిన ఇంటిని పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు.



కూలిపోయిన ఇంటిని పరిశీలిస్తున్నా పంచాయతి కార్యదర్శి

చదువుల్లో అంతరాలు పోవాలి

- మాజీ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

అమరచింత, మే 28 (ఆంధ్రజ్యోతి) : పేద బడుగు బలహీన వర్గాల పిల్లల కోసం ప్రభుత్వ బడులు బలోపేతం కావాలని, చదువుల్లో అంతరాలు పోవాలని తెలంగాణ పౌర స్పందన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. వేదిక ఆధ్వర్యంలో చేపట్టిన ప్రచార జాత బుధవారం రాత్రి అమర చింతకు చేరింది. యూటీఎఫ్, సీపీఎం, ప్రజా సంఘాల నాయకులు ప్రచార జాతకు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్య వైద్యానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇవ్వా లన్నారు. ప్రైవే టుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల బలోపేతం కోసం పాలకులు కృషి చేయాలని కోరారు. సమా జంలో ఆర్థిక, సామాజిక అంతరాలు తగ్గిపోగా, చదువుల్లో మాత్రం అంత రాలు కనిపిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలలో ప్రీ ప్రైమరీ తరగతులను తక్షణమే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ప్రచార జాతలో తెలంగాణ పౌర స్పందన వేదిక ఉపాధ్యక్షులు కేఎం ధనమూర్తి, నాగమణి, సీపీఎం నాయకురాలు కావ్య, యూటీఎఫ్ నాయకులు జీఎస్ గోపి, శ్రీనివాసులు, అగ్రిపా, ఆదాం, రాములు, అజయ్, బీటీ కిరణ్, వెంకటేశ్, రవి, లూథర్, అరుణ్ పాల్గొన్నారు.

యువతి అదృశ్యం : కేసు నమోదు

మిడ్జిల్, మే 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని లింబ్యాతండా గ్రామ పంచాయతీ చేదుగట్టుతండాకు చెందిన క్రొరవత్ రాజు కుమార్తె రత్న మాల మంగళవారం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదని తండ్రి రాజు బుధవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ శివనాగేశ్వర్‌నాయుడు తెలిపారు. యువతి ఆచూకి తెలిసిన వారు వెంటనే మిడ్జిల్ పోలీసులకు సమాచారం అందించాలని ఎస్ఐ కోరారు.

కాలువలకు భద్రత ఏది?

- ధ్వంసం అవుతున్న ఎంజీకేఎల్ఐ ప్రధాన కాలువ
- వచ్చే ఏడాదే మరమ్మతులు
- ఎంజీకేఎల్ఐ అధికారుల వెల్లడి



అంకిరావుపల్లి కాలువ దగ్గర ధ్వంసం అయిన ఎంజీకేఎల్ఐ ప్రధాన కాలువ

కొల్లాపూర్, మే 28 (ఆంధ్రజ్యోతి) : కోట్ల రూపాయలు ఖర్చు చేసి నాగర్‌కర్నూల్ జిల్లా ప్రజలకు తాగు, సాగు నీరందించేందుకు నిర్మించిన ఎంజీకేఎల్ఐ ప్రాజెక్టు ప్రధాన కాలువలు ధ్వంసం అవుతున్నాయి. కాలువల చుట్టూ ఉన్న లైనింగ్ దెబ్బతిని కాలువలు కృంగిపోతున్నాయి. కొల్లాపూర్ మండలంలోని ఎల్లూరు శివారులో రేగుమాన్ గడ్డ సమీపంలో నిర్మించిన ఎంజీకేఎల్ఐ ప్రాజెక్టులో భాగమైన ఎల్లూరు రిజర్వాయర్ నుంచి సింగోటం శ్రీవారి సముద్రం వరకు ఉన్న ప్రధాన కాలువ పూర్తిగా ధ్వంసం అవుతోంది. ఈ కాలువలను పట్టించుకునే అధికారులు, ప్రజాప్రతినిధులు చూసీ చూడనట్లుగా వ్యవహరించడంతో కాలువల మరమ్మతులు ప్రశ్నార్థకంగా మారాయి. మరో 15 రోజుల్లో జూరాల డ్యాం నుంచి కృష్ణా నదికి వరద జలాలు చేరనున్నాయి. ఈ వరద జలాలు చేరిన వెంటనే ఎంజీకేఎల్ఐ ప్రాజెక్టు ద్వారా నాగర్‌కర్నూల్ జిల్లా పరిధిలో ఉన్న రిజర్వాయర్లను నింపేందుకు ప్రాజెక్టు ద్వారా సాగునీరు విడుదల చేయనున్నారు.

ప్రధాన కాలువలు ఇలా ఉంటే ఎలా..

ప్రధాన కాలువ పరిస్థితి ఇలా ఉంటే ఎలా అని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే మే నెలలో వచ్చిన అకాల వర్షాలతో తెలుగు రాష్ట్రాలకు అనుసంధానంగా ఉన్న సప్తనదుల సంగమేశ్వర ఆలయం సమీపంలో భీమలింగం ప్రాంగణంలో కొత్త నీరు చేరింది. ఇలా కృష్ణానదికి వరద పెరిగితే ఎంజీకేఎల్ఐ ప్రాజెక్టు ప్రధాన కాలువల ద్వారా నీటిని విడుదల చేసి ఎల్లూరు రిజర్వాయర్ సింగోటం శ్రీవారి సముద్రం జొన్నల బొగుడ, గుడిపల్లి రిజర్వాయర్లను నింపుతారు. ఇలా ధ్వంసం అయిన ఎంజీకేఎల్ఐ ప్రధాన కాలువల మరమ్మతుల విషయంలో ఆంధ్రజ్యోతి ఆ శాఖ డీఈ అమర్‌సింగ్ దృష్టికి తీసుకువెళ్లగా ఈ ఏడాది మరమ్మతులు చేయలేమని, మరో 15, 20 రోజుల్లో సాగునీరు విడుదల ఉంటుందని తెలిపారు. మరమ్మతులు చేయాలంటే వచ్చే ఏడాదే అవకాశం ఉంటుందని సమాధానం ఇచ్చారు.

పాలమూరుకు సాంకేతిక సొబగులు

(5వ పేజీ తరువాయి)



స్థల పరిశీలన చేస్తున్న బాసర ట్రిపుల్ ఐటీ వీసీ, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి (ఫైల్)

శివారులోని సర్వే నెంబర్ 423/1, 423/18, 425/1లో 20.06 ఎకరాలు, చిట్టెబోయినపల్లిలోని సర్వనెంబర్ 1/1లో 21.26 ఎకరాలలో సర్వే చేసిన ప్రతిపాదనలు పంపించారు. యూనివర్సిటీ భవనం, కోర్సులకు సంబంధించి ల్యాబ్‌లు, వర్క్‌షాపులు, లైబ్రరీలు, సెమినార్లు, స్టాఫ్ క్వార్టర్లు, విద్యార్థుల వసతి గృహాల వంటి కల్పన కోసం ప్రభుత్వానికి రూ.711 కోట్లతో ప్రతిపాదనలు పంపిం చినట్లు తెలుస్తోంది. ఈ భవనం ఏర్పాటు అయ్యేవరకు తాత్కాలికంగా రాజబహదూర్ రెడ్డిసేవాసమితి ఫంక్షన్ హాల్‌లో కోర్సులు ప్రారంభించే అవకాశం ఉంది. కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజ నీరింగ్(ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్‌మాచిన్ లర్నింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ (డేటా సైన్స్) కోర్సులకు అనుమతి ఇస్తూ జీవో జారీ చేశారు. విద్యార్థులకు ఇక్కడ సీటు వస్తే ఆరేళ్ల పాటు కోర్సులు చేయాల్సి ఉంటుంది. ఒక్కో కోర్సులో మొదటి సంవత్సరం కావడంతో 50-100 మంది విద్యార్థులు ఉండనున్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులు పూర్తిగా మెరిట్ ఆధారంగా ట్రిపుల్‌ఐటీకి ఎంపిక కానున్నారు. ఆరేళ్లలో మొదటి రెండేళ్లు ఇంటర్, మిగిలిన నాలుగేళ్లు ఇంజనీరింగ్ కోర్సులు చేయాల్సి ఉంటుంది. మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి ముందునుంచి మహబూబ్‌నగర్‌ను ఎడ్యుకేషన్ హబ్ చేయాలని విద్యాపరంగా పలు కార్యక్రమాలు చేపడుతున్నారు. ఇప్పటికే పాలమూరు యూనివర్సిటీలో ఇంజనీరింగ్, లా కళాశాలలు తీసుకురాగా, ఏడాదిగా ట్రిపుల్ ఐటీ కోసం చేస్తున్న ప్రయత్నాలు ఎట్టకేలకు ఫలించాయి.

దరఖాస్తు చేసుకునే విధానం

బాసర క్యాంపస్‌లో 1500 మంది, మహబూబ్‌నగర్‌లో క్యాంపస్‌లో 180 మంది విద్యార్థులకు ఏడాది ప్రవేశం కల్పిస్తూ నోటిఫికేషన్ విడుదల చేశారు. ఈ ఏడాది పదవ తరగతి వార్షిక పరీక్షలు మొదటి సారి రాసి ఉత్తీర్ణులైన విద్యార్థులు మాత్రమే ప్రవేశాలకు దరఖాస్తుచేసుకోవచ్చు. ఈ నెల 31వ తేదీ నుంచి జూన్ 21వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో మాత్రమే దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఆర్జీయూకేటీ.ఎసీ.ఇన్ టీఎస్ ఆన్‌లైన్ సెంటర్ ద్వారా వివిధ ధ్రువీకరణ పత్రాలు సమర్పించి దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తు అనంతరం ఏఏ పత్రాలు అయితే సమర్పించామో వాటి జిరాక్స్ కాపీల సెట్‌ను యూనివర్సిటీకి రిజిష్టర్ పోస్టు ద్వారా పంపించాలి. విద్యార్థులు యూనివర్సిటీకి వచ్చి దరఖాస్తు చేసుకునే విధానం లేదు. కేవలం ఆన్‌లైన్‌లో మాత్రమే దరఖాస్తులను స్వీకరిస్తారు. ఎంపిక జాబితా కూడా యూనివర్సిటీ వైబ్‌సైట్‌లోనే ప్రకటిస్తారు. వెబ్‌సైట్ చూసుకొని విద్యార్థులు వారు కేటాయించిన తేదీల్లో క్యాంపస్‌కు వచ్చి కౌన్సిలింగ్‌లో పాల్గొని అడ్మిషన్ కావాల్సి ఉంటుంది. జూలై 4వ తేదీన ఎంపికైన విద్యార్థుల జాబితాను అధికారులు విడుదల చేయనున్నారు.

మారనున్న జడ్చర్ల రూపురేఖలు

- ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి

జడ్చర్ల, మే 28 (ఆంధ్రజ్యోతి) : జడ్చర్ల మండలం చిట్టబోయిన్‌పల్లి సమీపంలో ఐఐటీ ఏర్పాటు కానుందని, దీంతో జడ్చర్ల రూపు రేఖలు మారనున్నాయని ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐఐటీ మంజూరీ చేసి దక్షిణ తెలంగాణ అభివృద్ధిలో భాగం చేశారన్నారు. జడ్చర్ల, మహబూబ్‌నగర్ శివారులో ఐఐటీ నిర్మాణం మంజూరు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి సహకారంతోనే ఫలించిందని తెలిపారు. జడ్చర్ల మండలం చిట్టబోయిన్‌పల్లి శివారులో 21 ఎకరాల 26 గుంటలు, మహబూబ్‌నగర్ అర్బన్ మండలంలోని ఎదిర శివారులో 20 ఎకరాల 6 గుంటలు కేటాయించిందని పేర్కొన్నారు.

ట్రిపుల్ ఐటీ పాలమూరుకు మణిహారం..

- పీఆర్టీయూ తెలంగాణ వ్యవస్థాపకుడు హర్షవర్ధన్‌రెడ్డి

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, మే 28 (ఆంధ్రజ్యోతి) : పాలమూరు జిల్లాకు మణిహారం ట్రిపుల్ ఐటీ అని, ఇందుకోసం మహబూబ్‌నగర్ జడ్చర్ల ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, అనిరుధ్‌రెడ్డి ఎంతగానో కృషి చేశారని పీఆర్టీయూ తెలంగాణ వ్యవస్థాపక అధ్యక్షుడు, టీపీసీసీ అధికార ప్రతినిధి గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి విద్యారంగాన్ని పరుగులు పెట్టిస్తున్నారన్నారు. ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి పట్టుబట్టి పాలమూరుకు ఇజనీరింగ్, లా కాలేజీ తీసుకొచ్చారన్నారు.

తెలకపల్లి గురుకులానికి అభినందనలు

» సీఎం చేతుల మీదుగా ప్రిన్సిపాల్‌కు ప్రశంసాపత్రం

తెలకపల్లి/ అచ్చంపేట టౌన్, మే 28 (ఆంధ్రజ్యోతి) : పదవ తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించిన తెలకపల్లి గురుకుల పాఠశాల, కళాశాలను సీఎం రేవంత్‌రెడ్డి అభినందించారు. హైదరాబాద్‌లోని బాబూ జగ్జీవన్‌రామ్ భవనంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో సీఎం చేతుల మీదుగా ప్రిన్సిపాల్ ఏఆర్ లక్ష్మి ప్రశంసాపత్రం అందుకున్నారు.

ఉత్తమ ప్రిన్సిపాల్‌గా అంజయ్య

అచ్చంపేట సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ అంజయ్య రాష్ట్ర స్థాయి ఉత్తమ ప్రిన్సిపాల్ పురస్కారాన్ని గురుకుల కార్యదర్శి చేతుల మీదుగా అందుకున్నారు. ఆయనకు రెండవ సారి ఈ పురస్కారం లభించింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రైవేటు, కార్పొరేటు కళాశాలలకు దీటుగా విద్యార్థులను తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామన్నారు.


రాష్ట్ర స్థాయి ఉత్తమ ప్రిన్సిపాల్ అవార్డు అందుకుంటున్న అంజయ్య

క్రైం కార్నర్

ప్రాణం తీసిన వివాహేతర సంబంధం

» భర్త, కుమార్తెను వదిలి మరో వ్యక్తితో వెళ్లిన వివాహిత
» తిరిగి రావడంతో ఇరు కుటుంబాల మధ్య గొడవ
» ఆత్మహత్యాయత్నం చేసిన ప్రియుడు
» మనస్తాపంతో ఆమె బలవన్మరణం

రాజోలి, మే 28 (ఆంధ్రజ్యోతి) : వివాహేతర సంబంధం రెండు కుటుంబాల మధ్య గొడవకు దారి తీసింది. ఓ వ్యక్తిని ఆత్మహత్యాయత్నానికి పురి గొలిపింది. ఓ వివాహిత బలవన్మరణానికి పాల్పడేలా చేసింది. జోగుళాంబ గద్వాల జిల్లా, రాజోలి మండల కేంద్రంలో ఈ సంఘటన జరిగింది. ఎస్ఐ జగదీశ్వర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండల కేంద్రమైన రాజోలికి చెందిన మహిళ (32)కు భర్త, కుమార్తె ఉన్నారు. ఆమెకు గ్రామానికి చెందిన కుర్వ పుల్లన్న అనే వ్యక్తితో పరిచయం ఏర్పడింది. ఈ నెల 12వ తేదీన భర్త, కుమార్తెలను వదిలేసి అతడితో వెళ్లిపోయింది. ఈ ఘటనపై రాజోలి పోలీస్ స్టేషన్‌లో మిస్సింగ్ కేసు నమోదయ్యింది. అలా వెళ్లిపోయిన ఆమె ఈనెల 25న కుమార్తెను చూసుకునేందుకు గ్రామానికి తిరిగి వచ్చింది. అప్పటికే మిస్సింగ్ కేసు నమోదై ఉండటంతో పోలీసులు ఆమెను పిలిపించి మాట్లాడారు. తాను కుర్వ పుల్లన్నతో ఇష్టపూర్వకంగానే వెళ్లినట్లు ఆమె చెప్పింది. పలు ప్రాంతాలు, పుణ్యక్షేత్రాల్లో తిరిగి, వరంగల్‌కు చేరుకున్నామని, అక్కడే కొన్ని రోజులు ఉన్నామని తెలిపింది. ఈ సంఘటనపై 27వ తేదీన గ్రామంలో పంచాయితీ పెట్టడంతో రెండు కుటుంబాల మధ్య వాగ్వాదాలు జరిగాయి. ఆ తర్వాత ఎవరి ఇళ్లకు వారు వెళ్లిపోయారు. అదే రోజు సాయంత్రం పుల్లన్న పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేయడంతో కుటుంబ సభ్యులు చికిత్స కోసం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఒకవైపు పుల్లన్న పురుగుల మందు తాగడం, మరోవైపు కుటుంబ సభ్యులు బాధపడ్తుండటంతో ఆమె మనస్తాపానికి గురయ్యింది. బుధవారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో చీరతో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నది. సంఘటనపై మృతురాలి తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.


పశువుల దొంగల అరెస్టు


ఖిల్లాఘణపురం పోలీస్‌స్టేషన్‌లో పశువులను తరలించిన వాహనాలు, నిందితులతో సీఐ రాంబాబు, ఎస్ఐ సురేశ్‌గౌడ్, సిబ్బంది

ఖిల్లాఘణపురం, మే 28(ఆంధ్రజ్యోతి) : పశువుల చోరీ కేసులో ఇద్దరిని అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించినట్లు సీఐ రాంబాబు, ఎస్ఐ సురేశ్ గౌడ్ తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. షాపురం గ్రామానికి చెందిన మామిళ్ల మాసయ్య, అతని దాయాదులకు చెందిన 9 పశువులు అపహరణకు గురైనట్లు ఈ నెల 4వ తేదీన ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్పీ రావుల గిరిధర్ ఆధ్వర్యంలో డీఎస్పీ వెంకటేశ్వరరావు, కొత్తకోట సీఐ రాంబాబు ఆధ్వర్యంలో ప్రత్యేక పోలీస్ బృందాలు విచారణ చేపట్టాయి. బుధవారం తెల్లవారుజామున మండలంలోని తిరుమలాయపల్లి శివారులో పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. ఆ సమయంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న హైదరాబాద్‌కు చెందిన మహమ్మద్ సిరాజ్ ఖురేషీ, మహమ్మద్ అమీర్ ఖురేషీలను అదుపులోకి తీసుకొని ప్రశ్నించగా, వారు నేరం అంగీకరించారు. పశువుల అపహరణలో వారితో పాటు మరో నలుగురు హస్మత్, రఫీక్, షాహబాజ్, జుబేర్‌లు పాల్గొన్నారని, వారు పరారీలో ఉన్నారని విచారణలో వెల్లడైంది. చోరీ చేసిన పశువులను మూడు వాహనాల్లో తరలించి, విక్రయించగా, రూ. 1,80,000 వచ్చినట్లు విచారణలో తేలింది. వారి నుంచి వాహనాలతో పాటు నగదును స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. నిందితులను అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. కేసును ఛేదించిన ఎస్ఐ సురేశ్‌గౌడ్, కానిస్టేబుళ్ల లింగం, రాజు, చైతన్యకుమార్, మునహర్‌లను ఆయన అభినందించారు.

మార్చాల గేటు సమీపంలో డివైడర్‌ను ఢీకొట్టిన లారీ

» తప్పిన పెను ప్రమాదం


డివైడర్‌ను ఢీ కొట్టిన లారీ

కల్వకుర్తి, మే 28 (ఆంధ్రజ్యోతి) : కల్వకుర్తి మండలం మార్చాల గేటు సమీపంలో బుధవారం తెల్లవారుజామున లారీ డివైడర్‌ను ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... జడ్చర్ల నుంచి కల్వకుర్తి వైపు లోడుతో వెళ్తున్న లారీ అదుపు తప్పి డివైడర్‌ను బలంగా ఢీ కొట్టడంతో ముందు భాగంలో ఉన్న టైర్లు పూర్తిగా ఊడిపోయాయి. ఆ సమయంలో రోడ్డుపై ఎవరూ లేకపోవడంతో పెనుప్ర మాదం తప్పింది. డ్రైవర్ నిద్రమత్తు వల్లే ఈ ప్రమాదం జరిగి ఉంటుందని స్థానికులు భావిస్తున్నారు.


మూలమల్ల గ్రామం వద్ద రోడ్డుపై నీటి మడుగులను తలపిస్తున్న వర్షపు నీరు


ఆత్మకూరు పట్టణానికి వెళ్లే దారిలో ఏర్పడిన గుంతల్లో నిలిచిన వర్షపు నీరు

'జూరాల' రోడ్డు అధ్వానం

» గుంతల మయమై రాకపోకలకు ఇక్కట్లు
» కృష్ణా పుష్కరాల సమయంలో నిధులు మంజూరు
» పనులను మధ్యలోనే నిలిపేసిన కాంట్రాక్టరు
» ప్రజలు, ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు

ఆత్మకూరు, మే 28 (ఆంధ్రజ్యోతి) : రెండు జిల్లాలను కలిపే రహదారి ఇది.. జూరాల ప్రాజెక్టు సందర్శనకు వెళ్లే రోడ్డు ఇది.. అయినా దీనిని పట్టించుకునే వారు కరువయ్యారు. పూర్తిగా గుంతలమయమై రాకపోకలు కష్టంగా మారింది. రోడ్డు మరమ్మతు కోసం నిధులు మంజూరై తొమ్మిదేళ్లు గడిచినా.. ఇప్పటికీ పనులు పూర్తి కాలేదు. 2016 కృష్ణా పుష్కరాల సమయంలో జూరాల ప్రాజెక్టు సందర్శనకు వేలాది మంది వచ్చే అవకాశం ఉండటంతో అప్పటి ప్రభుత్వం రోడ్డు మరమ్మతుల కోసం రూ. 8.30 కోట్లు మంజూరు చేసింది. ఈ నిధులతో 11 కిలోమీటర్ల మేర రహదారికి మరమ్మతులు చేపట్టాల్సి ఉంది. ఈ పనులను శ్రీ సాయి కన్‌స్ట్రక్షన్స్ అనే సంస్థ దక్కించుకున్నది. అప్పటి బీఆర్ఎస్ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి చేతుల మీదుగా మరమ్మతు పనులను ప్రారంభించారు. కానీ నిధులు సరిపోవడం లేదంటూ మధ్యలోనే వదిలేశారు. అప్పటి నుంచి ప్రయాణికులు అవస్థలు పడుతూనే ఉన్నారు.

రెండు జిల్లాలను కలిపే ప్రధాన రహదారి

వనపర్తి జిల్లా నుంచి ఆత్మకూరు, మూలమల్ల, నందిమల్ల గ్రామాల నుంచి, ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు మీదుగా జోగుళాంబ గద్వాల జిల్లాకు చేరుకునే ప్రధాన రహదారి ఇది. ఈ రోడ్డు మీదుగా ప్రతీ రోజు వందలాది వాహనాలు తిరుగుతుంటాయి. ప్రతీ ఏడాది వర్షాకాలంలో జూరాల ప్రాజెక్టుకు భారీగా వరద వస్తుంది.

ఆ సమయంలో ప్రాజెక్టు అందాలను తిలకించేందుకు ఉమ్మడి జిల్లాతో పాటు ఇతర జిల్లాల నుంచి వేలాది మంది సందర్శకులు వస్తుంటారు. కానీ రోడ్డు మరమ్మతులు చేపట్టకపోవడం సమస్యగా మారింది. వనపర్తి, గద్వాల జిల్లాల నుంచి ఆర్టీసీ బస్సులు నడవక పోవడంతో సందర్శకులు ప్రైవేటు వాహనాలను ఆశ్ర యించాల్సి వస్తోంది.

నిధుల కొరతతో పనులకు ఆటంకం

గతంలో జూరాల ప్రాజెక్టు కుడి, ఎడమ కాలువల ఆయకట్టు పరిధిలోని రైతుల నుంచి నీటి పన్ను వసూలు చేయడం ద్వారా నిధులు సమకూరేవి. అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులకు ఆయకట్టు ద్వారా ఉచితంగా సాగునీరు అందజేయాలని నిర్ణయించింది. దీంతో నీధుల కొరత ఏర్పడింది. ఈ నేపథ్యంలో ప్రాజెక్టు పరిధిలోని రోడ్లను పంచాయతీరాజ్ శాఖకు బదిలీ చేయాలని ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేసినట్లు సంబంధిత అధికారులు చెప్తున్నారు. రహదారి మరమ్మతులు చేపడతామని గత ఎన్నికల సమయంలో ప్రధాన పార్టీల అభ్యర్థులు హామీలు ఇచ్చారు. కానీ ఇప్పటివరకు ఆ విషయంపై ఎవరూ దృష్టి సారించలేదు. ప్రస్తుతం అధికారం చేపట్టిన మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ప్రత్యేక చొరవ తీసుకొని పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని మూలమల్ల, నందిమల్ల, ఆత్మకూరు గ్రామాల ప్రజలు, ప్రాజెక్టు సందర్శకులు కోరుతున్నారు.

తక్షణమే మరమ్మతులు చేపట్టాలి..



రోడ్డు మరమ్మతులకు నిధులు మంజూరు చేసినా, ఇప్పటివరకు పనులు పూర్తి చేయలేదు. దీంతో ఆయా గ్రామాల ప్రజలు ఆత్మకూరు మండల కేంద్రానికి చేరుకునేందుకు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. మరో పక్షం రోజుల్లో విద్యా సంవత్సరం ప్రారంభం కానున్నది. అప్పుడు విద్యార్థులు వందల సంఖ్యలో మండల కేంద్రంలోని పాఠశాలలకు వెళ్తారు. కాబట్టి అధికారులు వెంటనే స్పందించి రోడ్డు మరమ్మతులు చేపట్టాలి.

- హనుమంతు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు, నందిమల్ల

ఉన్నతాధికారులకు నివేదికలు పంపించాం..



రోడ్డు మరమ్మతు కోసం 2016లో నిధుల మంజూరైన మాట వాస్తవమే. కానీ నిధులు సరిపోవడం లేదని కాంట్రాక్టు సంస్థ మధ్యలోనే పనులను నిలిపివేసింది. మళ్లీ రీటెండర్ కోసం ఇరిగేషన్ ఉన్నతాధికారులకు నివేదికలు పంపించాం. ఈ విషయంపై మరో పక్షం రోజుల్లో పూర్తి స్పష్టత రానున్నది. అనంతరం ఆన్‌లైన్‌లో టెండర్లు పిలువనున్నాం.

- జగన్మోహన్, ఈఈ, జూరాల ప్రాజెక్టు

మహబూబ్‌నగర్ జట్టు విజయం

» వనపర్తి జట్టుపై 47 పరుగుల తేడాతో గెలుపు
» సెంచరీ, 4 వికెట్లు తీసి రాణించిన డేవిడ్ క్రిపాల్
» సెంచరీతో రాణించిన ఏ. శ్రీకాంత్
» 6 వికెట్లు తీసి చెలరేగిన ముఖీద్
» ఉత్సాహంగా సాగుతున్న క్రికెట్ 2డే లీగ్


సెంచరీ, 4 వికెట్లు తీసి రాణించిన డేవిడ్‌క్రిపాల్


సెంచరీ చేసిన ఏ. శ్రీకాంత్


6 వికెట్లు తీసి రాణించిన ముఖీద్

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, మే 28 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్ క్రికెట్ సంఘం (హెచ్‌సీఏ) ఆధ్వర్యంలో అండర్-23 ఉమ్మడి జిల్లా 2డే లీగ్‌లో మహబూబ్‌నగర్ జట్టు వనపర్తిపై 47 పరుగుల ఇన్నింగ్స్ తేడాతో విజయం సాధించింది. జిల్లా కేంద్రంలోని సమర్థ పాఠశాల మైదానంలో బుధవారం 4వ మ్యాచ్ నిర్వహించారు. తొలి ఇన్నింగ్‌లో మహబూబ్‌నగర్ జట్టు 47 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 315 పరుగులకు డిక్లేర్ చేసింది. జట్టులో డేవిడ్ క్రిపాల్ 93 బంతుల్లో 9 ఫోర్లు, 4 సిక్స్‌లతో సెంచరీ (111), ఏ శ్రీకాంత్ 94 బంతుల్లో 16 ఫోర్లు, ఒక సిక్స్‌తో సెంచరీ(105) చేశారు. మహేష్‌నాయక్ 67 బంతుల్లో 4 ఫోర్లు 8 సిక్స్‌లతో అర్ధసెంచరీ(79) చేసి రాణించారు. తరుణ్ 41, కే. శ్రీకాంత్ 19 పరుగులు చేశారు. అనంతరం ఇన్నింగ్ ప్రారంభించిన వనపర్తి జట్టు 27.2 ఓవర్లలో 77 పరుగులకు మహబూబ్‌నగర్ బౌలర్ల దాటికి కుప్పకూలింది. జట్టులో పవన్‌కుమార్ 27, రోహిత్‌చరణ్ 17 పరుగులు చేశారు. మహబూబ్‌నగర్ బౌలర్లలో మహ్మద్ ముఖీద్ 6 వికెట్లు తీసి వనపర్తి జటును్త తక్కువ స్కోర్‌కే కట్టడి చేశాడు. అభినవ్ 2, కే. శ్రీకాంత్ ఒక వికెట్ తీశారు. ఫాలో ఆన్ రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన వనపర్తి జట్టు 33.3 ఓ వర్లలో 191 పరుగులకు ఆలౌట్ అయ్యింది. 47 పరుగుల ఇన్నింగ్ తేడా మహబూబ్‌నగర్ ఘన విజయం సాధించింది. జిల్లా బౌలర్లలో మహ్మద్ ముఖీద్ 3, డేవిడ్ క్రిపాల్ 4 ఎ. శ్రీకాంత్ 2 వికెట్ల తీసి జట్టు విజయానికి కృషి చేశారు.

జాతీయ స్థాయికి ఎదగాలి

జిల్లా క్రీడాకారులు జాతీయ స్థాయికి ఎదగాలని క్రికెట్ సంఘం జిల్లా కోశాధికారి ఉదేష్‌కుమార్ అన్నారు. జిల్లా కేంద్రం సమీపంలోని సమర్థ స్కూల్ మైదానంలో నిర్వహిస్తున్న 2డే లీగ్ టోర్నీలో మహబూబ్‌నగర్-వనపర్తి జట్ల మధ్య మ్యాచ్‌ను ఆయన హాజరై ప్రారంభించారు. గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు హెచ్‌సీఏ ఉమ్మడి జిల్లా 2డే లీగ్ నిర్వహణకు అవకాశం కల్పించిందన్నారు. టోర్నీలో క్రీడాకారుడు చక్కటి ప్రతిభ కనబరిచి ఉమ్మడి జిల్లా జట్టుకు ఎంపిక కావాలని ఆకాంక్షించారు.

ప్రస్తుతం జాతీయ స్థాయిలో ఆడుతున్న క్రీడాకారులు చాలా మంది గ్రామీణ స్థాయి నుంచే వచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. కార్యక్రమంలో జిల్లా క్రికెట్ సంఘం ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, సీనియర్ క్రీడాకారుడు రంజిత్ పాల్గొన్నారు.

క్రీడలతో స్నేహభావం పెంపు

» ఏబీఏడీపీఎస్ జిల్లా అధ్యక్షుడు సీమ నరేందర్
» ప్రారంభమైన అయ్యప్ప ప్రీమియర్ లీగ్


క్రీడాకారులను ఉద్దేంచి మాట్లాడుతున్న అఖిల భారత అయ్యప్ప దీక్ష ప్రచార సమితి జిల్లా అధ్యక్షుడు సీమనరేందర్

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, మే 28 (ఆంధ్రజ్యోతి) : క్రీడలతో స్నేహభావం పెంపొందుతోందని అఖిల భారత అయ్యప్ప దీక్ష ప్రచార సమితి (ఏబీఏడీపీఎస్) జిల్లా అధ్యక్షుడు సీమ నరేందర్ అన్నారు. సమితి ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని బాలుర కళాశాల మైదానంలో నిర్వహిస్తున్న అయ్యప్ప ప్రీమియర్ లీగ్ క్రికెట్ (ఏపీఎల్) టోర్నీని ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమితి ఆధ్వర్యంలో సామాజిక సేవా కార్యక్రమాలతో పాటు, ప్రతీ సంవత్సరం క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. టోర్నీలో 32 జట్లు పాల్గొననున్నట్లు తెలిపారు.

తొలి రోజు విజేతలు వీరే....

తొలి రోజు జరిగిన లీగ్ మ్యాచ్‌లో అనిల్ లెవెన్ జట్టు వెంకటేశ్ ఎలెవెన్ జట్టుపై గెలుపొందింది. యాదయ్య జట్టు - అకాష్ జట్టుపై, విన్‌వీసీ జట్టు యూపీటీ ఎక్స్ లెవెన్ జట్టు - విన్ లెవెన్ జట్టుపై విజయం సాధించాయి. యూపీటీ లెవెన్ జట్టు - డీజే అరుణ్ జట్టుపై, రాహుల్ జట్టు - పరిమిళగిరి జట్టుపై గెలుపొందాయి. స్వర్ణాకర్ జట్టు - ప్రదీప్ జట్టుపై, డీజే బాయ్స్ జట్టు - విశాల్ జట్టుపై, పంచవటి జట్టు డీజే రాజు జట్టుపై విజయం సాధించాయి.

బీఫార్మసీ, బీఎడ్ ఫలితాలు విడుదల

పాలమూరు యూనివర్సిటీ, మే 28 (ఆంధ్రజ్యోతి) : పాలమూరు యూనివర్సిటీ పరిధిలో బీఫార్మసీ మొదటి సెమిస్టర్, బీఎడ్ మూడవ సెమిస్టర్ పరీక్ష ఫలితాలను బుధవారం పీయూ వీసీ ప్రొఫెసర్ జీఎన్ శ్రీనివాస్ విడుదల చేశారు. బీఫార్మసీ మొదటి సెమిస్టర్‌లో 51.52 శాతం, బీఎడ్ మూడవ సెమిస్టర్‌లో 80.83 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. ఫలితాలను తెలుసుకునేందుకు అధికారిక వెబ్‌సైట్‌ను సంప్రదించాలని పరీక్షల నిర్వహణాధికారి డాక్టర్ కే.ప్రవీణ తెలిపారు. కార్యక్రమంలో అదనపు పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ శాంతిప్రియ, ఎగ్జామినేషన్ కోఆర్డినేటర్ డాక్టర్ సురేశ్ తదితరులు పాల్గొన్నారు.


బి.ఫార్మసీ, బి.ఎడ్ సెమిస్టర్ పరీక్షల ఫలితాలను విడుదల చేస్తున్న పీయూ వీసీ ప్రొఫెసర్ జీఎన్ శ్రీనివాస్, పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ కె.ప్రవీణ

అప్పరాల విద్యార్థుల ప్రతిభ

» రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన ఐదుగురు

కొత్తకోట, మే 28 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లా, కొత్తకోట మండలంలోని అప్పరాల గ్రామానికి చెందిన ఐదుగురు విద్యార్థులు అథ్లెటిక్స్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. శిక్షకుడు అజయ్ కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జిల్లా కేంద్రంలోని డాక్టర్ బాలకిష్టయ్య క్రీడా ప్రాంగణంలో బుధవారం అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించారు. పోటీల్లో జోష్నవి 200 మీటర్లు, లేఖన 300 మీటర్లు, వేదశ్రీ లాంగ్‌జంప్, లోకేశ్వరి, చరణ్ షాట్‌పుట్‌లో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. వారు జూన్ 1 నుంచి 11వ తేదీ వరకు సికింద్రాబాద్ జింఖానా మైదానంలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొననున్నారు.

4న ఉమ్మడి జిల్లా జట్ల ఎంపిక

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, మే 28 (ఆంధ్రజ్యోతి) : షటిల్ బ్యాడ్మింటన్ రాష్ట్ర స్థాయి టోర్నీలో పాల్గొనే ఉమ్మడి జిల్లా జట్ల ఎంపికకు వచ్చే నెల 4న పోటీలు నిర్వహించనున్నారు. అండర్-13, 15, 17, 19 బాల, బాలికలు సీనియర్, వెటరన్ విభాగాల్లో ఎంపికలు ఉంటాయని జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్యామ్‌సుందర్‌గౌడ్, ఎల్.రవికుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు ఉదయం 9 గంటలకు మహబూబ్‌నగర్ ఇన్‌డోర్ స్టేడియంలో సంబంధిత ధ్రువ పత్రాలతో రిపోర్టు చేయాలని కోరారు.

ధన్వాడ విద్యార్థికి కాంస్య పతకం

ధన్వాడ, మే 28 (ఆంధ్రజ్యోతి) : మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని అల్పన్ అకాడమీ ఇన్‌డోర్ సిటీలో నిర్వహించిన జాతీయస్థాయి నెట్‌బాల్ పోటీల్లో ధన్వాడ విద్యార్థి కే.శివకుమార్ కాంస్య పతకం సాధించాడు. ఆయన ఈ నెల 25 నుంచి 28వ తేదీ వరకు జరిగిన జాతీయ స్థాయి సబ్ జూనియర్ బాల బాలికల నెట్‌బాల్ పోటీల్లో రాష్ట్రం తరఫున పాల్గొని కాంస్య పతకం సాదించారు. ఈ సందర్భంగా అతడిని కోచ్ రాంమో హన్‌గౌడ్ అభినందించారు.


కాంస్య పతకం సాధించిన విద్యార్థి

ప్రథమ చికిత్స కేంద్రం సీజ్


ప్రథమ చికిత్స కేంద్రంలో మందులను తనిఖీ చేస్తున్న డ్రగ్ ఇన్‌స్పెక్టర్

జడ్చర్ల, మే 28 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా, జడ్చర్ల మండల పరిధిలోని పోలేపల్లి గ్రామంలో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న ఓ ప్రథమ చికిత్స కేంద్రాన్ని అధికారులు సీజ్ చేశారు. గ్రామంలో వాసు క్లినిక్ పేరుతో నిర్వహిస్తు న్న ప్రథమ చికిత్స కేంద్రా న్ని బుధవారం జడ్చర్ల డ్రగ్ ఇన్‌స్పెక్టర్ మహ్మద్ రఫీ ఆధ్వర్యంలో తనిఖీ చేశారు. అనుమతి లేకుండా రూ. 1.50 లక్షల విలువైన మందులను నిల్వ ఉంచినట్లు గుర్తించారు. అర్హత లేకున్నా అలోపతి వైద్యం చేస్తున్నట్లు తెలుసుకున్నారు. మందులను స్వాధీనం చేసుకొని, శ్యాంపిల్స్‌ను ల్యాబ్‌కు పంపించారు. క్లినిక్‌ను సీజ్ చేసి, యజమానిపై కేసు నమోదు చేశారు. అనుమతి లేకుండా వైద్యం చేసినా, యాంటి బయోటిక్స్, ఇతర మందులు విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఇంటర్వ్యూ..

ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగులకు మెరుగైన వసతులు

- రామ్మోహన్, నియోజకవర్గ వైద్య, ఆరోగ్యశాఖ సమన్వయకర్త



కొల్లాపూర్, మే 28 (ఆంధ్రజ్యోతి) : కొల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో మాతా, శిశు సంరక్షణ కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని వైద్య, ఆరోగ్య శాఖ నియోజకవర్గ సమన్వయకర్త రామ్మోహన్ అన్నారు. ఆసుపత్రి పరిసరాలన్నీ పరిశుభ్రంగా ఉంచేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఆంధ్రజ్యోతికి ఇచ్చిన ఇంటర్వ్యూలో వెల్లడించారు.

ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగులకు వసతులు ఎలా ఉన్నాయి?

నియోజకవర్గ పరిధిలోని మండలాల్లో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రుల్లో, గ్రామాల్లోని ప్రాథమిక కేంద్రాల్లో 24 గంటల పాటు వైద్యులు, వైద్యసిబ్బంది అందుబాటులో ఉంటారు. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయి.

కొల్లాపూర్‌లో మాతా, శిశు సంరక్షణ కేంద్రంలో గర్భిణులకు ఎలాంటి వసతులు ఉన్నాయి?

అక్కడ డిప్యూటేషన్‌పై గైనకాలజిస్టు డాక్టర్ అందుబాటులో ఉన్నారు. గర్భిణులకు సిజేరియన్ ఆపరేషన్లు కూడా జరుగుతున్నాయి. మత్తు డాక్టర్, చిన్న పిల్లల డాక్టర్ కూడా అందుబాటులో ఉన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో వ్యాక్సిన్లు అందుబాటులో ఉన్నాయా?

కొల్లాపూర్ ప్రభుత్వ ఆసుపత్రితో పాటు అన్ని మిగతా అన్ని ఆసుపత్రుల్లో తప్పనిసరిగా పాము కాటు, కుక్క కాటు వ్యాక్సిన్లు అందుబాటులో ఉన్నాయి. ప్రభుత్వ ఆసుపత్రిలో ఆక్సిజన్ సెంటర్లు కూడా అందుబాటులోనే ఉన్నాయి. కొల్లాపూర్ ప్రభుత్వ ఆసుపత్రిలో మరమ్మతులో ఉన్న అంబులెన్స్‌ను త్వరలోనే బాగు చేయిస్తాం. ప్రస్తుతం 108 అంబులెన్స్‌ను వినియోగిస్తున్నాం.

డాక్టర్ల కొరత ఉందా?

కొల్లాపూర్ ప్రభుత్వ ఆసుపత్రిలో ఇంకా నలుగురు వైద్యులు కావాలి. సమస్యను మంత్రి జూపల్లి కృష్ణారావు దృష్టికి తీసుకు వెళ్లాం. త్వరలోనే వైద్యుల పోస్టులు భర్తీ అవుతాయి. అలాగే కొల్లాపూర్ మాతా, శిశు సంరక్షణ కేంద్రంలో ఒక అంబులెన్స్ వాహనం కావాలని మంత్రి దృష్టికి తీసుకువెళ్లాం. త్వరలోనే సమస్యను పరిష్కరిస్తామని మంత్రి పేర్కొన్నారు. దీంతో గర్భిణులకు అత్యవసర పరిస్థితుల్లో సమస్య తలెత్తకుండా ఉంటుంది.

న్యూస్ బాక్స్

రేపు ఎక్సైజ్ వాహనాల వేలం

కల్వకుర్తి, మే 28 (ఆంధ్రజ్యోతి) : కల్వకుర్తి ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో వివిధ ఎక్సైజ్ కేసుల్లో స్వాధీనం చేసుకున్న వాహనాలకు ఈ నెల 30న స్థానిక ఎక్సైజ్ కార్యాలయంలో వేలం పాట నిర్వహిస్తున్నట్లు ఎక్సైజ్ సీఐ వెంకట్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు నిర్వహించే వేలానికి ఆసక్తి గల వారు నిర్ణీత రుసుమును డిపాజిట్ చేసి వేలంలో పాల్గొనాలని ఆయన కోరారు.

రైతు భరోసా విడుదల చేయాలి

వంగూరు, మే 28 (ఆంధ్రజ్యోతి) : వానాకాలానికి సంబంధించి రైతు భరోసా నిధులను వెంటనే విడుదల చేయాలని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు శివరాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ రైతు భరోసా, రైతు రుణమాఫీ అమలులో, పాడి రైతులకు బిల్లుల, సన్నాలకు బోనస్ డబ్బులు చెల్లింపులో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు.

అందుబాటులో జీలుగ విత్తనాలు

ఉప్పునుంతల, మే 28 (ఆంధ్రజ్యోతి) : ఆగ్రో రైతు సేవా కేంద్రం, పీఏసీఎస్‌లో అందుబాటులో జీలుగ విత్తనాలు ఉన్నాయని వ్యవసాయాధికారి రమేష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 30 కిలోల జీలుగ విత్తనాలకు ధర రూ.4275 ఉండగా 50 శాతం సబ్సిడీతో రూ.21375 చెల్లించి తీసుకోవాలన్నారు.

31న సీపీఐ నియోజకవర్గ మహాసభలు

ఉప్పునుంతల మే 28 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 31న సీపీఐ నియోజకవర్గ మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ అచ్చంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి గోపాల్ అన్నారు. బుధవారం స్థానిక అంబేడ్కర్ చౌరస్తాలో ఈ నెల 31న అచ్చంపేటలోని ఎన్జీవో భవనంలో జరగనున్న సీపీఐ మహాసభల కరపత్రాలను ఆయన విడుదల చేశారు.

అధ్యాపకుల ఇంటింటి ప్రచారం

పెద్దకొత్తపల్లి, మే 28 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థుల అడ్మిషన్ల కోసం అధ్యాపకులు బుధవారం వివిధ గ్రామాల్లో ఇంటింటి ప్రచారం చేపట్టారు. 2024-25 సంవత్సరంలో నూతనంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలను ప్రభుత్వం ఏర్పాటు చేసిందని తెలిపారు. ఎంపీసీ, బైపీసీ, ఆర్ట్స్ సీఈసీ, హెచ్‌ఈసీ, ఒకేషనల్ గ్రూప్‌లలో ఎంపీహెచ్‌డబ్ల్యూ ఫిమేల్ మొదటి సంవత్సరం విద్యాభ్యాసం కొనసాగిందని తెలిపారు.

రేపు కలెక్టరేట్ ముట్టడి

నాగర్‌కర్నూల్ టౌన్, మే 28 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ కార్మికుల సమస్యలపై ఈ నెల 30న నిర్వహించ తలపెట్టిన కలెక్టరేట్ ముట్టడిని జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి.నరసింహ కోరారు. బుధవారం జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో వ్యవసాయ కార్మిక సంఘం ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. కలెక్టరేట్ ముట్టడిని విజయవంతం చేయాలని ఆయన కోరారు. సుభాష్, జనార్దన్‌చారి, బాలస్వామి పాల్గొన్నారు.

లోతు దుక్కులతో బహుళ ప్రయోజనాలు

- దుక్కులు దున్నడంతో రైతులు బిజీ
- తగ్గనున్న చీడపీడల బెడద
- సారవంతంగా మారనున్న భూములు



దేవునితిర్మలాపూర్ ట్రాక్టర్‌తో పొలం దున్నుతున్న రైతు

పెద్దకొత్తపల్లి, మే 28 (ఆంధ్రజ్యోతి) : ఖరీఫ్ సీజన్ సమీపిస్తుండడంతో రైతులు వేసవి దుక్కులు దున్నడంలో నిమగ్నమయ్యారు. సాగుకు ముందుగా భూమి దుక్కి దున్నడం ద్వారా సారవంతంగా మారడమే కాక చీడపీడల బెడద తగ్గించవచ్చు. పెద్దకొత్తపల్లితో పాటు దేవునితిర్మలాపూర్, వెన్నచెర్ల, నక్కలపల్లి, జొన్నలబొగుడ, సాతాపూర్, పెద్దకార్పాముల, యాపట్ల, చిన్నకార్పాముల, మరికల్, ముష్టిపల్లి తదితర గ్రామాల్లో రైతులు ట్రాక్టర్లు, ఎద్దులతో ముమ్మరంగా వేసవి దుక్కులు దున్నుతున్నారు. ఖరీఫ్ పంటలు వేసుకునేందుకు రైతులు వేసవి దుక్కి దున్నడం బహుళ ప్రయోజనాలు ఉంటాయి. వర్షాలు కురవగానే దుక్కిని లోతుగా దున్నుకోవాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. రెండు మూడు రోజుల నుంచి మండలంలో కురుస్తున్న వర్షాల కారణంగా రైతులు వేసవి దుక్కులు దున్నుకోవడంలో నిమగ్నమయ్యారు. వేసవి దుక్కుల వల్ల నేలలోని కలుపు మొక్కలు వాటి విత్తనాలు తీవ్రత తగ్గుతుంది. తొలకరి వర్షాలు కురవగానే విత్తనాలు సాగు చేసుకునేందుకు అనువుగా భూమి మారుతుంది. భూమి గుల్లబారి తేమ నిల్వ సామర్థ్యంపై పెరిగి విత్తనాలు పూర్తిస్థాయిలో మొలకెత్తుతాయి. పంట అధిక దిగుబడి సాధించేందుకు అవకాశం ఉంటుంది. ప్రభుత్వం ఇస్తున్న రైతు భరోసా సాయంతో రైతుకు పెట్టుబడికి కొంత సాయంగా ఉపకరిస్తుందని రైతులు అభిప్రాయపడుతున్నారు.

వేసవి దుక్కులతో అధిక దిగుబడులు



రైతులు వేసవి దుక్కులు దున్నుకోవడం వలన అధిక పంట దిగుబడులు వచ్చేం దుకు అవకాశం కలుగుతుంది. వేసవి దుక్కులు లోతుగా దున్నుకోవాలి. చీడపీడల బెడద, తెగుళ్ల సమస్య తగ్గుతుంది. భూమి సారవంత మవు తుంది. పెట్టుబడి తగ్గుతుం ది. అధిక దిగుబడులు సా ధించవచ్చు.

- శిరీష, మండల వ్యవసాయ అధికారి, పెద్దకొత్తపల్లి



దేవునితిర్మలాపూర్‌లో పశువుల ఎరువును ట్రాక్టర్‌తో పొలాలకు తరలిస్తున్న రైతు



పెద్దకొత్తపల్లి శివారులో దున్ని సాగుకు సిద్ధం చేసిన రైతు

ధాన్యం తరలింపునకు..

రవాణా అధికారులు కృషి చేయాలి

- కలెక్టర్ బదావత్ సంతోష్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ బదావత్ సంతోష్

నాగర్‌కర్నూల్, మే 28 (ఆంధ్రజ్యోతి) : ధాన్యం తరలింపునకు రవాణాకు అధికారులు అత్యంత కీలకంగా వ్యవహరించాలని, జిల్లాలో చివరి దశలో ఉన్న ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ బదావత్ సంతోష్ అధికారులు, కొనుగోలు నిర్వాహకులను ఆదేశించారు. బుధవారం అదనపు కలెక్టర్ చాంబర్‌లో అదనపు కలెక్టర్ అమరేందర్‌తో కలిసి రెవెన్యూ, పౌర సరఫరాల, రవాణా శాఖల అధికారులు, మిల్లర్లు, లారీ అసోసియేషన్ సభ్యులతో ధాన్యం కొనుగోలు ప్రక్రియపై కలెక్టర్ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో కురుస్తున్న వర్షాలకు కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం ఎక్కడా తడవకుండా కొనుగోలు కేంద్రాల నుంచి మిల్లులకు గోదాములకు తరలించేందుకు రవాణాకు అవసరమైన లారీలను అధికమొత్తంలో వినియోగించాలని అధికారులను పురమాయించారు. ప్రతీ కొనుగోలు కేంద్రంలో రైతులకు టార్పాలిన్ కవర్లు అందుబాటులో ఉంచాలన్నారు. వర్షాల కారణంగా ధాన్యం తడిసిపోకుండా కొనుగోలు చేసిన వెంటనే లారీలకు ఎక్కించి తక్షణమే గోదాములకు తరలించాలని ఆదేశించారు.

జూన్ 2న మంజూరు పత్రాల పంపిణీ

రాజీవ్ యువ వికాసం పథక ద్వారా దశలవారీగా లబ్ధి చేకూరేల ప్రణాళిక రూపొందించి జూన్ 2న లబ్ధిదారులకు మంజూరు పత్రాలు పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ బదావత్ సంతోష్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో బుధవారం బీసీ, ఎస్సీ, మైనార్టీ, ట్రైబల్ కార్పొరేషన్, ఎంపీడీవోలు, మునిసిపల్ కమిషనర్లు, సంబంధిత శాఖల అధికారులతో రాజీవ్ యువ వికాసం పథకం, ఇందిరమ్మ ఇళ్లు, పథకాల లబ్ధిదారుల వివరాలపై కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. రాజీవ్ యువ వికాసం యూనిట్ల గ్రౌండింగ్ ఏర్పాట్లను సిద్ధం చేయాలని కలెక్టర్ సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచేలా అధికారులు కృషి చేయాలని కలెక్టర్ సూచించారు.

ఏఎస్ఐ వెంకటపతికి ఘన సన్మానం



ఏఎస్ఐ వెంకటపతిని సన్మానిస్తున్న మాల ఉద్యోగుల సంఘం నాయకులు

నాగర్‌కర్నూల్ టౌన్, మే 28 (ఆంధ్రజ్యోతి): హెడ్ కానిస్టేబుల్ నుంచి ఏఎస్ఐగా పదోన్నతి పొందిన తగిలి వెంకటపతిని ఘన సన్మానించారు. బుధవారం జిల్లా కేంద్రంలోని మున్నూరుకాపు ఫంక్షన్‌హాలులో మాల ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఏఎస్ఐ తగిలి వెంకటపతిని శాలువా, పూల మాలలతో సన్మానించి అభినందనలు తెలిపారు. మాల ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు కూన గోవర్ధన్ మాట్లాడుతూ వెంకటపతి హెడ్ కానిస్టేబుల్ నుంచి ఏఎస్ఐగా పదోన్నతి పొందడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో మాల ఉద్యోగుల సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు జి.ప్రభాకర్, కోశాధికారి కోటేశ్వర్, సలహాదారు ప్రిన్సిపాల్ కృష్ణయ్య, సభ్యులు శోభన్‌బాబు, గడ్డం బాలరాజు, కురుమయ్య, యాదయ్య, రవికుమార్, మద్దిలేటి, దాసరి శేషగిరి, సుధాకర్, పిల్లి వెంకటేష్, పంబలి పర్వతాలు, సైదులు, పాలమూరు నిరంజన్, రాఘవులుగౌడ్, కృష్ణయ్య, బండి నరసింహ, గాజుల శ్రీనివాసులు, కేశవ్, చీకిరాల రాంచందర్ పాల్గొన్నారు.

అమెరికా వెళ్లిన మాజీ ఎమ్మెల్యే



అమెరికాకు వెళుతున్న మాజీ ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛంతో కలిసిన మాజీ మునిసిపల్ చైర్మన్, నాయకులు

అచ్చంపేటటౌన్, మే 28 (ఆంధ్రజ్యోతి) : జూన్ 1న అమెరికాలోని డల్లాస్‌లో జరగనున్న తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకల కోసం అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు బుధవారం అమెరికా వెళ్లారు. మునిసిపల్ మాజీచైర్మన్ నర్సింహ, పదర మాజీ జడ్పీటీసీ సభ్యుడు రాంబాబు, కౌన్సిలర్లు అంతటి శివ, శంకర్‌తో పలువురు నాయకులు ఆయనను శంషాబాద్ విమానాశ్రయంలో కలిసి పుష్పగుచ్ఛంతో సత్కరించారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలి : బీజేపీ

అమ్రాబాద్, మే 28 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన అమ్రాబాద్‌లో వారం రోజుల నుంచి మిషన్ భగీరథ ద్వారా తాగునీరు సరఫరా కాకపోవడంతో గ్రామస్థులు తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గంగిశెట్టి నాగరాజు, మండల అధ్యక్షుడు బొడ్డుపల్లి శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రంలోని పలు వీధుల్లో గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో నీటిని సరఫరా చేసే బోరు మోటారు కొంతకాలంగా పనిచేయకపోవడంతో తాగునీటి సమస్య ఏర్పడిందని వారు పేర్కొన్నారు. బుధవారం గ్రామపంచాయతీ సమీపంలో నివశిస్తున్న ప్రజలతో కలిసి బీజేపీ నాయకులు ఆందోళనకు దిగారు. ఈ విషయంపై మిషన్ భగీరథ అధికారులతో పాటు గ్రామపంచాయతీ అధికారులకు పలుమార్లు విన్నవించినా ఎలాంటి ఫలితం లేదని వారు వాపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తాగునీటి సమస్యను పరిష్కరించపోతే తమ పార్టీ ఆధ్వర్యంలో స్థానిక అంబేడ్కర్ చౌరస్తాలో ఆమరణ నిరాహార దీక్ష చేస్తామని హెచ్చరించారు. ఆందోళన కార్యక్రమంలో నాయకులు సతీష్ కుమార్, వెంకటచారి, అభిరామ్, కాలనీ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాల గురించి ప్రజలకు వివరించాలి : బీజేపీ



మాట్లాడుతున్న కాట్రావత్ జ్యోతి

అచ్చంపేటటౌన్, మే 28 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో ప్రధాని మోదీ అందించే పథకాల గురించి ప్రజలకు వివరించాలని బీజేపీ మండల అధ్యక్షురాలు కాట్రావత్ జ్యోతి అన్నారు. బుధవారం పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో శక్తికేంద్ర ప్రముఖ్, ప్రభారీల నియామకాల సంస్థాగత సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మండలంలో 10 శక్తి కేంద్రాలకు ప్రముఖ్, ప్రభరీలను నియమించనున్నట్లు తెలిపారు. కార్యకర్తలు నిత్యం ప్రజల్లో ఉంటూ ప్రజాసమస్యలు పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు మోక్తాల రేణయ్య, నాయకులు ఆంజనేయులు, అఖిల్ రెడ్డి, గోవిందు, అనిల్ పాల్గొన్నారు.

రేపు వక్ఫ్‌భూముల వేలం పాట

బల్మూరు, మే 28 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 30న స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో మండల పరిధిలోని గోదల్ గ్రామ శివారులో ఉన్న భూములకు ఉదయం 11గంటల నుంచి వేలం పాట కొనసాగుతున్నట్లు తహసీల్దార్ శ్రీకాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్ (నాంపల్లి)లోని తెలంగాణ రాష్ట్ర వక్ఫ్ బోర్డు చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఉత్తర్వుల మేరకు వేలం పాట వేయనున్నట్లు తెలిపారు. మండల పరిధిలోని గోదల్ గ్రామ జామే మస్జిద్ భూమి సర్వే నెంబరు 120, 21/1, 121/2 సర్వే నెంబర్లు ఉన్న మొత్తం విస్తీర్ణం 369 ఎకరాల 11గుంటల భూమి ఉన్నట్లు వారు తెలిపారు. 2025-26 సంవత్సరానికి గాను ఒక సంవత్సరం కాస్తు చేసుకోవడానికి వేలం వేయనున్నట్లు తెలిపారు. ఈ వేలం పాటలో పాల్గొనే వారు 18ఏళ్లు నిండిన వారై ఉండాలని, డిపాజిట్‌గా రూ.5వేల చెల్లించాలన్నారు. వేలం పాట పూర్తై వరకు రైతులు ఎవరు కూడా కాస్తూ చేయరాదని సూచించారు.

పేదలకు సీఎంఆర్ఎఫ్ వరంలాంటిది



దేవునితిర్మలాపూర్ బాధితుడు చంద్రయ్యకు సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేస్తున్న కాంగ్రెస్ నాయకుడు సత్యం

పెద్దకొత్తపల్లి, మే 28 (ఆంధ్రజ్యోతి) : అనారోగ్యంతో కార్పొరేట్ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్యం పొందేందుకు బాధితులకు ఆపద్బాంధవుడిగా సీఎంఆర్ఎఫ్ అండగా ఉందని మాజీ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు అన్నారు. మండలంలోని దేవునితిర్మలాపూర్ గ్రామానికి చెందిన మిద్దె చంద్రయ్య అనారోగ్యంతో కార్పొరేట్ ఆస్పత్రిలో చికిత్స చేయించుకుని సీఎం దరఖాస్తు చేసుకోగా రూ.50వేలు మంజూరైంది. ఈ చెక్కును మిద్దె చంద్రయ్యకు మాజీ సర్పంచ్ గన్నోజు సత్యం, ఉప సర్పంచ్ వడ్డె మాన్ శ్రీనివాసులు అందజేశారు. అలాగే ఇదే మండలం చంద్రబండతండాకు చెందిన బాధితుడు ముడావత్ లలితకు రూ.60వేలు సీఎంఆర్ఎఫ్ నుంచి మంజూరైన చెక్కులను కాంగ్రెస్ నాయకులు శంకర్‌నాయక్, గోపీనాయక్‌లు అందజేశారు.

● మన్ననూర్ : మన్ననూరు గ్రామంలో కోన అంజి కుటుంబానికి మంజూరైన ముఖ్యమంత్రి సహాయ నిధిరూ.36వేల చెక్కును కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు పిట్టల సురేష్ బుధవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ నంది హన్మంత్‌రెడ్డి, కోఆప్షన్ మాజీ సభ్యుడు రహీం, కాంగ్రెస్ నాయకులు సైదులు, కృష్ణయ్య, గోపాల్, బాలు, సత్యనారాయణ, బిక్కు, నరేష్ ఉన్నారు.

తెలుగు జాతి ఆత్మగౌరవ ప్రతీక ఎన్టీఆర్

-102వ జయంతిలో టీడీపీ నాయకులు



మాట్లాడుతున్న టీడీపీ నాయకుడు కొప్పుల రమేష్

కందనూలు, మే 28 (ఆంధ్రజ్యోతి) : యుగ పురుషుడు, తెలుగు వారి ఆరాధ్య దైవం, తెలుగు ప్రజల ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన మహనీయుడు అన్న నందమూరి తారకరామారావు 102వ జయంతిని జిల్లా కేంద్రంలో శ్రీపురం చౌరస్తాలో ఘనంగా నిర్వహించారు. బుధవారం ఎన్టీఆర్ చిత్రపటానికి తెలుగుదేశం పార్టీ నాయకులు పూల మాలలు వేసి, కేక్‌కట్ చేశారు. ఈ సందర్భంగా టీడీపీ నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గ అధికార ప్రతినిధి కొప్పుల రమేష్ తెలుగు దేశం పార్టీ జెండాను ఎగురవేసిన అనంతరం మాట్లాడారు. పేదప్రజలకు కూడు, గూడు, గుడ్డఅనే మూడు అవసరాలను తీర్చడమే తన జీవితాశయంగా భావించిన ధీరోదాత్తుడు అన్న ఎన్టీఆర్ అని కొనియాడారు. తెలుగు వారి గుండెల్లో అన్నగారి స్థానం పదిలమని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు బాలకృష్ణ, మండల అధ్యక్షుడు రాము, శ్రీరాము, సుబ్బారెడ్డి, మోహన్ పాల్గొన్నారు.

ఎన్టీఆర్‌కు ఘన నివాళి

పెంట్లవెల్లి : మండల పరిధిలోని జటప్రోలు గ్రామంలో బుధవారం ఎన్టీఆర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. టీడీపీ మండల అధ్యక్షుడు రామకృష్ణగౌడ్ ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి, కేక్ కట్ చేశారు. వారు మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల కోసం ఎంతో కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచు గంగమ్మ, టీడీపీ నాయకులు మోహన్‌రెడ్డి, రామస్వామి, రమేష్ పాల్గొన్నారు.

నేటి నుంచి పాత్రికేయులకు శిక్షణ

మన్ననూర్, మే 28 (ఆంధ్రజ్యోతి) : జిల్లా పరిధిలో పని చేస్తున్న ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులకు రెండు రోజుల పాటు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలంగాణ మీడియా అకాడమీ కార్యదర్శి ఎస్ వెంకటేశ్వర్ రావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అమ్రాబాద్ మండలం మన్ననూరులోని అటవీ శాఖ వనమాలిక ఆవరణలో తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ సంఘం(టీయూడబ్ల్యూజే) సహకారం, అటవీశాఖ సౌజన్యంతో గురు, శుక్రవారాలలో శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ముఖ్య అతిథులుగా ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ హాజరవుతారని చెప్పారు. గురువారం జర్నలిస్టుల గతం, వర్తమానం, భవిష్యత్ మీడియా ధోరణి, భాష, తప్పొప్పులు దిద్దుబాటు, సమాచార హక్కు చట్టం-2005, జర్నలిస్టులకు దోహదం, ప్రత్యేక వార్తా కథనాలు, శుక్రవారం నైతిక నియమావళి, -మీడియా చట్టాలు, సైబర్ క్రైమ్, సోషల్ మీడియా, గ్రామీణ వార్తలు ఎలక్ట్రానిక్ మీడియా, నేరవార్తలు చేయాల్సినవి, చేయకూడనివి అనే అంశాలపై తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్‌తో పాటుగా వివిధ పత్రికల సంపాదకులు శ్రీనివాస్, ఆర్ శ్రీనివాసరావు, మార్కండేయ, సుధాకర్‌రెడ్డి, తోట భావనారాయణ, ఆర్టీఐ మాజీ కమిషనర్, సీనియర్ జర్నలిస్టు దిలీప్‌రెడ్డిలు పాత్రికేయులకు అవగాహన కల్పిస్తారని చెప్పారు. శుక్రవారం సాయంత్రం కలెక్టర్ బదావత్ సంతోష్, ఎస్పీ వైభవ్ గైక్వాడ్ రఘునాథ్‌తో డీఆర్‌డీవో అధికారులతో జిల్లా అభివృద్ధి సంక్షేమంపై ముఖాముఖి కార్యక్రమం ఉంటుందని, అనంతరం శిక్షణ తరగతుల ముగింపు ఉంటుందని వివరించారు.

తపాలా సేవలు వేగవంతం

- వనపర్తి డివిజన్ పర్యవేక్షకుడు భూమన్న

నాగర్‌కర్నూల్ టౌన్, మే 28 (ఆంధ్రజ్యోతి) : ఆధునిక సాంకేతికత పరిజ్ఞానంతో తపాలా సేవలను వేగవంతం చేశామని తపాలా శాఖ వనపర్తి డివిజన్ పర్యవేక్షకుడు భూమన్న అన్నారు. తపాలా సిబ్బందికి ఐటీ-2.0 సాంకేతిక పరిజ్ఞానంపై నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని ఎస్‌జేఆర్ ఫంక్షన్‌హాలులో బుధవారం నిర్వహించిన శిక్షణ సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రతీ కుటుంబానికి సంక్షేమ, పొదుపు పథకాలను అందించడంలో తపాలా శాఖ కీలకపాత్ర పోషిస్తోందన్నారు. అనంతరం పలువురు ఉద్యోగులకు జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలను అందించారు. కార్యక్రమంలో నాగర్‌కర్నూల్ తపాలా బ్రాంచ్ మేనేజరు ప్రసాద్, ఏఎస్‌పీ సైదానాయక్, ఇన్‌స్పెక్టర్లు సృజన్‌నాయక్, రవికుమార్, ఉద్యోగులు మహ్మద్‌ఖాన్, జగన్, రాంరెడ్డి, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

పౌర హక్కుల దినం నిర్వహించాలి : కేవీపీఎస్

నాగర్‌కర్నూల్ టౌన్, మే 28 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నెల 30 తేదీన నిర్వహించాల్సిన పౌర హక్కుల దినాన్ని విధిగా నిర్వహించాలని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి పులిజాల పరశురాం డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో కేవీపీఎస్ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఇంకా కుల వివక్ష, అంటరానితనం కొనసాగుతోందన్నారు. ప్రతీ నెల 30న పౌర హక్కుల దినం జరిపించేలా చర్యలు చేపట్టాలని ఆయన కోరారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు హనుమంతు, సహాయ కార్యదర్శి బత్తిని రాజు, నాయకులు పాల్గొన్నారు.

పాఠశాల ప్రారంభం రోజే యూనిఫామ్స్ అందజేస్తాం : ఎంఈవో

కొల్లాపూర్, మే 28 (ఆంధ్రజ్యోతి) : వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభం రోజునే ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు యూనిఫామ్‌లు అందించాల్సి ఉంటుందని ఎంఈవో ఇమ్మాన్యుయేల్ పేర్కొన్నారు. బుధవారం కొల్లాపూర్ మండలానికి సంబంధించిన పాఠశాల విద్యార్థుల యూనిఫామ్ స్టిచ్చింగ్ పనులను ఆయన పరిశీలించారు. స్టిచ్చింగ్ సెంటర్ల దగ్గరికి వెళ్లి జరుగుతున్న యూనిఫామ్ కుట్టు పనిని పరిశీలించారు. ఆలస్యం చేయకుండా సకాలంలో అందజేయాలని వారికి సూచించారు.

సీపీఎం మండల కార్యదర్శిగా రవి

కోడేరు, మే 28 (ఆంధ్రజ్యోతి) : భారత కమ్యూనిస్టు పార్టీ(మార్కిస్టు)సీపీ(ఐ)ఎం మండల కార్యదర్శిగా పి.రవిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండలంలోని రాజాపూర్‌లో పార్టీ జిల్లా కార్యదర్శి పర్వతాలు అధ్యక్షతన జరిగిన ముఖ్య నాయకుల సమావేశంలో రవిని ఎన్నుకున్నట్లు ప్రకటించారు. కొంత కాలంగా పార్టీలో క్రియాశీల కార్యకర్తగా పని చేసినందుకు ఆయనకు ఈ పదవి వరించిందని పలువురు నాయకులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండల నాయకులతో పాటు జిల్లా నాయకులు, పి నరసింహ, లక్ష్మయ్య, వెంకటయ్య పాల్గొన్నారు.

31న జిల్లా కేంద్రంలో శోభాయాత్ర

- మహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి

పెద్దకొత్తపల్లి, మే 28 (ఆంధ్రజ్యోతి) : లోకమాత రాణి అహిల్యాబాయి హోల్కర్ జయంతి సందర్భంగా జిల్లా కేంద్రంలో ఈ నెల 31వ తేదీ మధ్యాహ్నం 2గంటలకు జరిగే శోభాయాత్రను విజయవంతం చేయాలని బీజేపీ మహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి బద్దుల శశిరేఖ, ప్రవీణ్‌యాదవ్‌లు బుధవారం ఒక ప్రకటనలో కోరారు. కొల్లాపూర్ నియోజకవర్గంలోని అన్ని గ్రామాల నుంచి యువతి, యువకులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొని శోభాయాత్రను విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

తుంపర సేద్యంపై అవగాహన

మన్ననూర్, మే 28 (ఆంధ్రజ్యోతి) : అమ్రాబాద్ మండలం మాచారం గ్రామంలోని వ్యవసాయ పొలాల్లో అమర్చిన బిందు సేద్యం యూనిట్లను విజయవంతగా ఉపయోగించడంపై రైతులకు ఉద్యాన శాఖ అధికారులు బుధవారం అవగాహన కల్పించారు. హెడ్ కంట్రోల్ యూనిట్‌లో గల ప్రెషర్ గేజ్ ఉపయోగం, ఫిల్టర్‌ని ప్రతీ రోజు శుభ్రపరచడం, తిరిగి అమర్చడం, త్రోటల్ వాల్వ్ ద్వారా నీటి ప్రెషర్‌ను కంట్రోల్ చేయడం వంటి అంశాలపై డ్రిప్ కంపెనీ టీం ద్వారా శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో అచ్చంపేట డివిజన్ ఉద్యానవన అధికారి కన్న జగన్, గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ లక్ష్మీ ప్రసాద్, ఉపాధి హామీ ప్రత్యేకాధికారి మల్లికార్జున్, లబ్దిదారులు ఉడుతనూరి అలివేలు, పెద్దిరాజు, సైదులు, వెంకటయ్య, మల్లేష్, దాసరి మల్లయ్య, పర్వతాలు, కాట్రాజు రవి, డ్రిప్ కంపెనీ ప్రతినిధులు అంజనేయులు, గోవర్ధన్ పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు

- ఫర్టిలైజర్ షాపుల్లో రికార్డులను తనిఖీ చేసిన వ్యవసాయ, పోలీసు, రెవెన్యూ అధికారులు



కొల్లాపూర్ పట్టణంలో ఫర్టిలైజర్ షాపుల్లో రికార్డులను పరిశీలిస్తున్న వ్యవసాయ, పోలీసు అధికారులు

కొల్లాపూర్/ చారకొండ/ ఉప్పునుంతల/ పదర/ తిమ్మాజిపేట/ ఊర్కొండ, మే28 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో వ్యవసాయ, రెవెన్యూ, పోలీసు, ఇతర శాఖల అధికారులు సంయుక్తంగా ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. ఆయా దుకాణాల్లోని స్టాక్ రిజిస్టర్లు, బిల్ బుకులు, పరిమితి కాలం, లాట్ నెంబర్లు క్షుణ్ణంగా పరిశీలించారు. రైతులకు నకిలీ విత్తనాలు, ఎరువులు, ఫర్టిలైజర్ విక్రయిస్తే అలాంటి డీలర్లపై చట్టపరమైన చర్యలు తప్పక ఉంటాయని అధికారులు హెచ్చరించారు. కొల్లాపూర్‌లో వ్యవసాయ శాఖ ఇన్‌చార్జి ఏడీఏ చిన్న హుస్సేన్ యాదవ్, సీఐ మహేష్, ఎస్ఐ హృషికేష్ ఆధ్వర్యంలో శ్రీ వెంకటేశ్వర ఆగ్రో రైతు సేవ కేంద్రం, కార్తికేయ ట్రేడర్స్, ఆగ్రో రైతు సేవ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు.

● చారకొండలో ఎరువుల దుకాణాలను వ్యవసాయ శాఖ అధికారి, సీడ్ టాస్క్‌ఫోర్సు మెంబర్స్ ఏవో చేవూరి తనూజరాజు, ఎస్ఐ శంషుద్దీన్ తనిఖీ చేశారు. రైతులకు ఇచ్చే రశీదులో కంపెనీ పేరు, విత్తనం రకం, బ్యాచ్ నెంబర్, లాట్ నెంబర్, ధర, డీలర్ సంతకం, రైతు సంతకం ఉండాలని అన్నారు.

● ఉప్పునుంతలలోని ఆగ్రో రైతు సేవా కేంద్రం, పీఏసీఎస్, రామకృష్ణ ట్రేడర్లపై వ్యవసాయాధికారి రమేష్, ఎస్ఐ వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో తనిఖీలు చేశారు.

● పదరలో ఉన్న పలు విత్తన దుకాణాలను ఎస్ఐ సద్దాం హుస్సేన్‌తో కలిసి సీఐ శంకర్‌నాయక్ తనిఖీ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి సూరజ్ కుమార్ ఉన్నారు.

● తిమ్మాజిపేట మండల పరిధిలోని అమ్మపల్లి గ్రామంలో విత్తనాలు, పురుగుల మందులు ఎరువులు అమ్మే దుకాణాన్ని మండల వ్యవసాయ అధికారి కమల్‌కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ పాస్ మిషన్ ద్వారానే రైతుకు ఎరువులు అమ్మకాలు జరగాలని అన్నారు.

● ఊర్కొండ : మండల కేంద్రంలో ఆగ్రో రైతు సేవ కేంద్రం, ఆంజనేయస్వామి ట్రేడర్స్‌ను వ్యవసాయ అధికారి దీప్తితో కలిసి ఎస్ఐ కృష్ణదేవ ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. వారి వెంట ఏఈవో, డీలర్లు ఉన్నారు.